V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర


అక్షరం సాక్షిగా..

శనివారం
01-06-2024

సంపుటి : 01 | సంచిక : 28 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



Ln. డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB






Loaded with **100+** World Class Amenities.

- Fully-Equipped Outdoor/Indoor Gym
- Yoga / Aerobics & Meditation Room
- Tennis Court & Badminton Court
- Indoor & Outdoor Kids Play Area
- Swimming Pool
- Sand Volleyball Court
- Net Cricket Pitch
- Jogging Track
- Skating Rink
- Pet Park
- Multipurpose Hall
- Amphitheater

## Better Planning, Better Location
## Better Amenities, Better Value

### LOCATION HIGHLIGHTS

- **1 Min. Walk** Shopping /Markets Movie theaters
- **1 Min. Drive** Healthcare Hospitals
- **1 Min. Drive** ATM/Banks Offices
- **1 Min. Drive** Schools/ Coachings


### LOCATION MAP







CLUBHOUSE


KIDS PLAY AREA



INDOOR GAMES


GYM


CLUBHOUSE


POOL DECK


BANQUET HALL


RESTAURANT

All Images are Artist's Impression


**+91 90191 00099 | www.thevasavigroup.com**

**Disclaimer:** This advertisement does not constitute an offer and / or acceptance and / or contract and / or agreement and / or transaction and/or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. The pictorial/other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative imagination and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock/standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. **All norms, requirements pertaining to the environment, Fire Services, GHMC Rules and Regulations have been adhered to while designing the property.**

V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
01-06-2024
సంపుటి : 01 । సంచిక : 28 । పేజీలు : 12 । వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



దశాబ్దాల పోరాటం.. ఎందరో వీరుల త్యాగ ఫలం.. ప్రత్యేక ఆకాంక్ష.. స్వరాష్ట్రంపై అభిలాష.. సంస్కృతి, సాహితీ ఉద్యమం.. మేథావుల ఆరాటం.. నిరుద్యోగుల ఆశల సౌధం ప్రత్యేక తెలంగాణ. ఉవ్వెత్తున ఎగసిన తెలంగాణ ఉద్యమం ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా పార్లమెంట్ విభజించింది. భారత పార్లమెంటు చట్టం రెండు రాష్ట్రాల సరిహద్దులను నిర్వచించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. అయితే పదేళ్లు పూర్తి చేసుకున్నా నేటికీ విభజన హామీలు నెరవేరలేదు. ఈ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలు తరచూ ఘర్షణ పడుతూనే ఉన్నాయి. ఇంతకు విభజన చట్టం ఏ చెబుతుంది..? కేంద్రం ఇచ్చిన హామీలు ఏంటీ..? రెండు రాష్ట్రాల మధ్య వివాదంలో ఉన్న సమస్యలు ఏంటీ..? హామీల అమలు ఎలా ఉందో చూద్దాం.

# పదేళ్ల తెలంగాణ

## నేటికీ అమలు కాని విభజన హామీలు!

## ఘర్షణలకు దారి తీసిన నీటి వివాదాలు

- పూర్తికాని ఆస్తులు, ఉద్యోగుల పంపకాలు
- అటకెక్కిన బయ్యారం ఉక్కు కర్మాగారం
- జాడలేని గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం
- తెలంగాణ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఏది?
- నీళ్లు, నిధులు, నియామకాలు అందేదెన్నడు?

**విశ్వంభర, హైదరాబాద్:**

2014వ సంవత్సరం ఫిబ్రవరి 18వతేదీన భారత లోక్ సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 బిల్లును అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.ఈ బిల్లు ఫిబ్రవరి 20వతేదీన రాజ్యసభలో ఆమోదించారు.ఈ బిల్లును అప్పటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మార్చి 1వతేదీన ధృవీకరించి, మార్చి2న అధికారిక గెజిట్ లో ప్రచురించారు.దీంతో ఈ చట్టం ప్రకారం 2014 జూన్2వతేదీన తెలంగాణ ఆవిర్భవించింది.ఈ చట్టం ప్రకారం

మిగతా5లో...

# నాయకుల్లో మొదలైన కౌంటింగ్ టెన్షన్



- ఎంపీ, ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ
- పాలమూరుపై లీడర్ల ప్రత్యేక దృష్టి
- సీఎం రేవంత్ రెడ్డి జిల్లా ఫలితంపై ఆసక్తి
- టూర్ల నుంచి ఇళ్లకు చేరుకున్న నేతలు

**విశ్వంభర, హైదరాబాద్:** స్వల్ప విరామం తర్వాత పాలమూరు పాలిటిక్స్ మళ్లీ హిటెక్కుతున్నాయి. మొన్నటి వరకు పార్లమెంట్ ఎన్నికల హీట్ కొనసాగగా పోలింగ్ అనంతరం లీడర్ల అంతా రిలాక్స్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఇక కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో మరోమారు నేతల్లో అలజడి మొదలైంది. ఎంపీ ఎన్నికల ఫలితాల కంటే ముందు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఫలితం రానుండడంతో అన్ని పార్టీలు అలెర్ట్ అయ్యాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, అనంతరం ఒక్కరోజు తేడాతో ఎంపీ ఎన్నికల కౌంటింగ్ కౌంట్ డౌన్ మొదలైంది. వరుస ఎన్నికలతో బీజీబీజీగా గడుపుతున్న నేతలకు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తర్వాత స్వల్ప విరామం దొరికింది. దీంతో కొద్ది రోజులు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు రెస్ట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఇక కౌంటింగ్‌కు సమయం అసన్నం

మిగతా5లో...

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

- సీఎంపై, నాపై అఘోరాలతో తాంత్రిక పూజలు
- కేరళలోని రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో హోమాలు
- హోమంలో 50 జంతువులను బలిచ్చి చేతబడి
- వాళ్లు చేతబడి చేసినా మేము నమ్మే శక్తి మమ్మల్ని రక్షిస్తుంది
- నిమ్మకాయ నిపుణులకు భయపడేది లేదు
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు

9



# నా తల్లిదండ్రులు జాగ్రత్త!

- ఈ సారి ఎంతకాలం జైలులో ఉంటానో తెలియదు
- నేను వచ్చేంత వరకు పథకాలన్నీ కొనసాగుతాయి
- జైలులో నన్ను చిత్రహింసలకు గురి చేస్తారు
- అయినా నేను వాళ్లకు లొంగేది లేదు
- ఢిల్లీ ప్రజలకు సందేశం పంపిన సీఎం కేజ్రీవాల్

9



# మెడికల్ మాఫియా

## గల్లీకో ప్రైవేటు హాస్పిటల్..

- సూర్యాపేటలో జోరుగా దందా
- ప్రైవేటు హాస్పిటల్స్‌లో నిలువు దోపిడీ
- పేషెంట్లను పీడిస్తోన్న యాజమాన్యాలు
- వంత పాడుతున్న వైద్యారోగ్య శాఖ

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:**

'వైద్యో నారోయణ హరీ' అన్న మాటలకు సూర్యాపేట ప్రైవేటు హాస్పిటల్స్ కొత్త అర్థం చెబుతున్నాయి. ఆపదంటూ వచ్చిన పేషంట్ల నుంచి ముక్కు పిండి డబ్బులను అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. మామూలుగా

మిగతా5లో...

# రూ.1100 కోట్లు

- లోక్‌సభ ఎన్నికల్లో సీజ్ చేసిన నగదు, నగలు
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో పట్టుబడింది రూ. 390 కోట్లే..
- ఢిల్లీ, కర్ణాటకలో అత్యధిక నగదును పట్టుకున్న ఐటీ అధికారులు

5

# ప్రైవేట్ స్కూళ్లకు సర్కార్ షాక్

- స్కూళ్లలో యూనిఫాం, షూస్ అమ్మకాలపై నిషేధం
- రాష్ట్ర, సీబీఎస్సీ, ఐసీఎస్ఈ స్కూళ్లలో అమలుకు ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ

5

# ఫోన్ ట్యాపింగ్‌తోనే సమంతకు విడాకులు

- హరీష్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేయించారు
- అందరి వేళ్లూ కేసీఆర్ వైపే చూపిస్తున్నాయి
- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ సంచలన వ్యాఖ్యలు

6



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 142 | ₹ 164 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹238 | ₹ 271 |

# సీఎం రాష్ట్ర చిహ్నం మార్చకపోవడమే మంచిది

- రాష్ట్ర గీతం రూపొందించడం అభినందనీయం
- రాష్ట్ర గీతాన్ని కీరవాణి కంపోజ్ చేయడంలో తప్పేముంది
- మోదీ ధ్యానం చేయడమంటే కన్యాకుమారిని కలుషితం చేయడమే
- ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ గెలిచే అవకాశాలు లేవు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

5





## బాలలందరికీ విద్య ఉత్త మాటేనా?

# చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా!

**జూన్ 1...అంతర్జాతీయ బాలల దినోత్సవం**



నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యా గంధం లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకార మయం చేసుకుంటున్నారు.


ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం.

యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం.

ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది.

28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాద నపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

## తెలుగు చిత్రసీమలో ప్రథమ నేపథ్య గాయకుడు ఎమ్మెస్



"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యంలో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ వినిపించడం సర్వ సాధారణమే. అంతేకాక, ఆంజనేయ, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించడం కద్దు.

మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్. రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అనగానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావదాం ధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగు లోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.

1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి. రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు.



# చిరంజీవి హన్మంతుడు

ఒక కల్పం...నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో "మార్గళి" మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు ఆయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే.



హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండి పోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువబడే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు. భగవద్దాసులలో సాటిలేని ఆంజనేయుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది. రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు.

అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు, నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు అయిన చిరంజీవి ఆంజనేయుని నమ్ముకొని, భక్తి శ్రద్ధలతో, హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## విలక్షణ రాజకీయ నాయకుడు

# నీలం సంజీవరెడ్డి



**నేడు నీలం సంజీవరెడ్డి వర్ధంతి**

నీలం సంజీవరెడ్డి విలక్షణ నాయకుడు. భారత దివంగత రాష్ట్రపతి సంజీవరెడ్డి రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకులతో కూడుకున్నది. విజయాలు, అపజయాలు, త్యాగాలు, సాహసోపేత నిర్ణయాలు, రాజకీయపు ఎత్తుగడలతో కూడిన జీవితం ఆయనది. 1940 నుంచి 1970ల వరకు మూడు దశాబ్దాల రాష్ట్ర, దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రతి ముఖ్య సంఘటనతోనూ ఆయనకు ప్రత్యేక, ప్రత్యక్ష, సంబంధాలు, ప్రమేయాలు ఉన్నాయి. భారత రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అరుదైన రికార్డు రాష్ట్రపతి సంజీవరెడ్డికే దక్కింది. లోక సభాపతిగా ఎన్నిక కాగానే, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి లోక్‌సభ సభాపతి, సంజీవరెడ్డి కావడం విశేషం. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికారపక్ష ప్రతిపక్షం మధ్య సమన్వయ సాధనకు కృషి చేసి, స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత నీలం సంజీవరెడ్డి.

లోక్‌సభ సభాపతిగా రెండు సార్లు ఎన్నికై, రెండుసార్లూ రాష్ట్రపతిగా పోటీ చేసేందుకై రాజీనామా చేసిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, ఆ తరువాతి రాజకీయ చరిత్రలతో సంజీవరెడ్డి పాత్ర విస్మరించ లేనిది.

నీలం సంజీవరెడ్డి (మే 19, 1913 జూన్ 1, 1996) భారత రాష్ట్రపతిగా, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఉప ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, అఖిల భారత కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి సంజీవరెడ్డి. అనంతపురం జిల్లా, ఇల్లూరు గ్రామంలో 1913, మే 18 న రైతుబిడ్డగా సంజీవరెడ్డి జన్మించారు. మద్రాసు దివ్యజ్ఞాన సమాజం పాఠశాలలోను, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను చదువుకున్నారు.

1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో చదువును పక్కనపెట్టి రాజకీయాల్లో చేరి స్వాతంత్ర్య పోరాటం వైపు దృష్టి సారించారు. 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై దాదాపు పదేండ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. 1940, 1945 ల మధ్య ఎక్కువకాలం అతను జైలులో ఉన్నారు. 1946లో మద్రాసు శాసనసభకు, తర్వాత 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘమైన రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. 1949 నుంచి 1951 వరకు మద్రాసు రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసారు. 1951 లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు మంత్రిపదవికి రాజీనామా చేసారు. 1951లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఎన్.జి రంగాతో పోటీ పడ్డారు. ప్రకాశం పంతులు మద్దతు ఉన్నా.. రంగాను ఆ ఎన్నికల్లో ఓడించారు. ఫలితంగా ఆచార్య రంగా, ప్రకాశం కాంగ్రెసును వదిలి వెళ్ళారు.

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు సంయుక్త మద్రాసు రాష్ట్ర శాసనసభ సభ్యుల నుంచి కొత్త రాష్ట్ర కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకుణ్ణి ఎన్నుకునే సమయంలో సంజీవరెడ్డి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి పదవి తథ్యమైనా, అప్పటి రాజకీయాల ఫలితంగా తాను తప్పుకుని టంగుటూరి ప్రకాశం పంతులుకు నాయకత్వం అప్పగించి, ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మళ్ళీ 1955లో రాజకీయాల ఫలితంగానే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని వదులుకున్నారు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి ఎన్.జీ రంగా నాయకత్వంలోని కృషికార్ లోక్ పార్టీ మద్దతు కాంగ్రెసుకు అవసరమైంది. అయితే బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే తాము మద్దతు ఇస్తామని రంగా ప్రకటించడంతో తాను తప్పుకుని మళ్ళీ ఉప ముఖ్యమంత్రి అయ్యారు.

1964 జూన్ 9 న లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో కూడా కొద్దికాలం మంత్రిగా చేశారు. 1967లో నాలుగవ లోక్‌సభకు హిందూపురం నియోజకవర్గం నుంచి ఎన్నికై, లోక్‌సభకు సభాపతిగా కూడా ఎన్నికయ్యారు. సభాపతి నిష్పాక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నిక కాగానే, కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు 1969 జూలై 10న బెంగళూరులో సమావేశం అయి, పార్టీ అధ్యక్షుడు నిజలింగప్ప, ప్రధాని ఇందిర సహా పార్టీలోని పెద్దలు కే కామరాజ్, మొరార్జీ దేశాయి తదితరుల చర్చల అనంతరం 1969 జూలై 19 న సభాపతి పదవికి రాజీనామా చేసి, రాష్ట్రపతి పదవికి ఇందిరా గాంధీకి ఇష్టం లేకున్నా, కాంగ్రెస్ సీనియర్ నేతల నిర్ణయం మేరకు, ఇందిర నామినేషన్ దాఖలు వెంట రాగా, పోటీ చేశారు. "అంతరాత్మ ప్రబోధం" అనే ఇందిర నినాదంతో, కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల ఫలితంగా మరో తెలుగు వారు వీవీ గిరి చేతిలో కొద్ది తేడాతో ఓడి పోయారు.

1975 లో జయప్రకాశ్ నారాయణ్ హైదరాబాదులో జరిపిన పర్యటనతో రాజకీయాల్లో తిరిగి క్రియాశీల రాజకీయాల్లో పాలు పంచుకున్నారు. 1977లో ఎమర్జెన్సీ తరువాత, జనతాపార్టీ ప్రభంజనం కాంగ్రెసును అధికారం నుంచి దూరం చేసి నపుడు, తెలుగు ప్రజలు మాత్రం కాంగ్రెస్ వైపే ఉన్నారు. 42 స్థానాలకుగాను, 41ని కాంగ్రెస్ గెలుచుకుంది. జనతాపార్టీ గెలిచిన ఒక్క స్థానమూ మాత్రం సంజీవరెడ్డిదే కావడం గమనార్హం. అలా మళ్ళీ లోక్‌సభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

1977లో రాష్ట్రపతిగా ఉన్న ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మరణించడంతో నీలం సంజీవరెడ్డిని ఎన్నుకునేందుకు నాటి జనతా పార్టీ నిర్ణయం తీసుకాగా, విపక్షంలో ఉన్న ఇందిరా గాంధీ కూడా సంజీవ రెడ్డికి మద్దతివ్వడంతో సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు.

1982 లో రాష్ట్రపతి పదవి నిర్వహణ పూర్తయ్యాక, రాజకీయాల నుండి శాశ్వతంగా దూరమై, బెంగుళూరులో స్థిరపడగా ,1996 జూన్ 1 న నీలం సంజీవరెడ్డి మరణించారు.

### ఆంధ్ర ప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డిది ప్రముఖపాత్ర.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాపనలో ప్రధాన, నిర్ణాయక ఘట్టమైన పెద్దమనుషుల ఒప్పందంలో ఆంధ్ర తరపున అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి, బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి కూడా పాల్గొని ఒప్పందంపై సంతకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరించాక, కాంగ్రెసు శాసనసభాపక్ష నాయకుడిగా బెజవాడ గోపాలరెడ్డిని ఓడించి, తాను ముఖ్యమంత్రి అయ్యారు. అల్లూరి సత్యనారాయణ రాజును రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి పోటికి నిలబెట్టి, రంగాను ఓడించారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవికి తాను ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. అలా కాంగ్రెసు అధ్యక్షుడిగా రెండేండ్లు పనిచేసి, మళ్ళీ 1962లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. రవాణా సంస్థల జాతీయాకరణ వివాదంలో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టడంతో 1964 ఫిబ్రవరి 29 న పదవికి రాజీనామా చేశారు. తర్వాత కేంద్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# ప్రైవేట్ స్కూళ్లకు సర్కార్ షాక్

- స్కూళ్లలో యూనిఫాం, షూస్ అమ్మకాలపై నిషేధం
- నో లాస్ నో ప్రాఫిట్‌తో స్టేషనరీ పుస్తకాలు విక్రయాలకు పర్మిషన్
- రాష్ట్ర, సీబీఎస్సీ, ఐసీఎస్ఈ స్కూళ్లలో అమలకు ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ

**విశ్వంభర, హైదరాబాద్:** చదువుకోవడానికి పిల్లలను బడులకు పంపుతుంటాం. చదువు మాత్రమే చెప్పడం కాకుండా అనేక పాఠశాలల యాజమాన్యాలు యూనిఫాం, షూస్, బెల్ట్‌ల బిజినెస్ కూడా చేస్తుంటాయి. తమ దగ్గరే వాటిని కొనాలని, ఇతర దుకాణాల్లో కొనుకుంటే ఒప్పుకోబోమని బెదిరిస్తుంటాయి. హైదరాబాద్‌లో ఈ ధోరణి అధికంగా కనపడుతుంది. ఇకపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అటువంటి ఇబ్బందులు లేకుండా హైదరాబాద్ డీఈవో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రైవేట్ స్కూల్స్‌లో యూనిఫాం, షూస్ అమ్మడంపై నిషేధం విధించారు. హైదరాబాద్ ప్రైవేట్ స్కూల్స్ (రాష్ట్ర, సీబీఎస్సీ, ఐసీఎస్ఈ)లో యూనిఫాం, షూస్, బెల్ట్‌లను అమ్మడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్టేషనరీ పుస్తకాలు వంటివి మాత్రం నో లాస్ నో ప్రాఫిట్ బేసిస్ మీద అమ్ముకోవచ్చని ఆదేశాలు జారీ అయ్యాయి.

# హైదరాబాద్‌లోని రెస్టారెంట్లకు రేటింగ్



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రెస్టారెంట్లకు హైజీన్ రేటింగ్స్ ఇవ్వాలని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) నిర్ణయించింది. నగరంలోని పలు రెస్టారెంట్లపై ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడి ఆహారంలోని నాణ్యతను, వంట శాలల్లోని శుభ్రతపై క్షుణ్ణంగా పరిశీలించారు. శుభ్రత, నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలోనే రెస్టారెంట్లకు కస్టమర్లపట్ల జవాబుదారీతనాన్ని పెంచడం కోసం నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీచేయనుంది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ హెడ్ సంపత్ తుమ్మల అధ్యక్షతన 15 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలు నగరం అంతటా అమలయ్యేలా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ రెస్టారెంట్లలో పరిశుభ్రత ప్రమాణాలను పెంచడానికి, ఈ 15 మంది సభ్యులతో కూడిన బృందం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ సహకారం కోరింది.దీని కోసం ముందుగా రెస్టారెంట్లలో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు త్వరలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. దీని కోసం ప్రత్యేకంగా కొన్ని వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎన్ఆర్ఏఐ టాస్క్‌ఫోర్స్ సిద్ధమైంది. పరిశుభ్రత గురించి అవగాహన పెంచడంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భావిస్తోంది. ఇప్పటి వరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీల్లో చాలా వరకు పరిశుభ్రతా లోపం, ఆహార పదార్థాల్లో నాణ్యత లేమి స్పష్టంగా కనిపించినట్లు తెలుస్తోంది. పాడైపోయి, కాలం చెల్లిన ఆహార పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.

# పదో తరగతి విద్యార్థినికి గర్భం



**విశ్వంభర, చేవెళ్ల :** ప్రస్తుతం కామాంధులు రోజు రోజుకు రెచ్చిపోతున్నారు. పక్కింటి వారిని లేక వరుస అయ్యే వారిని.. కొంత మంది అయితే వావి వరుసలు కూడా మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా పదో తరగతి విద్యార్థినిపై ఓ కామాంధుడు కన్నేసి గర్భవతిని చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా పరిధిలోని చేవెళ్లలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. చేవెళ్లకు చెందిన కొజ్జంకి సుదర్శన్ అనే వ్యక్తికి వివాహమై ఓ పిల్లాడు కూడా ఉన్నాడు. ఈ క్రమంలోనే పాఠశాలకు వెళ్తున్న పదో తరగతి విద్యార్థిని వెంట నిత్యం వెంటబడుతూ.. ఆమెను లోబరచుకున్నాడు. దీంతో ఆ విద్యార్థిని గర్భం దాల్చింది. దీంతో ఎక్కడ పరువుపోతుందోనని గ్రహించిన విద్యార్థిని తండ్రి గాంధీ ఆసుపత్రిలో అబార్షన్ చేయించడంతో ప్రస్తుతం ఆ బాలిక ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. విద్యార్థిని తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కొజ్జంకి సుదర్శన్ పై పోలీసులు ఫోక్సో యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. నిందితుడు ఎమ్మెల్యే కాలె యాదయ్య అనుచరుడు అని తెలుస్తోంది.


## గొర్రెల పంపిణీ స్కాంలో ఇద్దరు అధికారులు అరెస్ట్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో జరిగిన గొర్రెల పంపిణీ స్కాంలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఇద్దరు అధికారులను అరెస్ట్ చేశారు. పశుసంవర్ధక శాఖ మాజీ సీఈ రాంచందర్ రావు, మాజీ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ అరెస్టయ్యారు. గొర్రెల పంపిణీ పేరుతో రూ.2.10 కోట్ల ప్రభుత్వ నిధులను రాంచందర్ దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులు వారిద్దరినీ నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రెండు వారాల రిమాండ్ విధించారు. దీంతో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. గొర్రెల స్కాంకు సంబంధించి ఇప్పటి వరకు ఏసీబీ ఆధికారులు పదిమందిని అరెస్ట్ చేశారు.

## బర్డ్‌ఫ్లూపై రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా లేదా బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1)పై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు నాలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ లక్షణాలను గుర్తించింది. ఏపీలోని నెల్లూరు, మహారాష్ట్రలోని నాగపూర్, కేరళలోని అలప్పుజ, కొట్టాయం, ఝార్ఖండ్‌లోని రాంచీలలో దాని వ్యాప్తిని గుర్తించినట్లు కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో పౌల్ట్రీలు, ఇతర పక్షులకు సంబంధించి అసాధారణ మరణాలు సంభవించడంపై అప్రమత్తంగా ఉండాలని, ఆ విషయాన్ని వెంటనే పశుసంవర్ధక శాఖకు తెలియజేయాలని అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది.అత్యంత వేగంగా వ్యాప్తి చెందే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా మానవులకూ సోకే ఆస్కారం ఉందని హెచ్చరించింది. ఈ వ్యాధి సంక్రమణను నిరోధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొంటూ మే 25న ఎన్సీడీసీ, కేంద్ర పశుసంవర్ధక శాఖలు కలిసి సంయుక్తంగా జారీ చేసిన ప్రకటనలో వెల్లడించాయి. యాంటీవైరల్ ఔషధాలు, పీపీఈ కిట్లు, మాస్కులు అందుబాటులో ఉండాలని పేర్కొంది. ఇన్‌ఫెక్షన్ సోకిన పక్షులను వధించే వారితోపాటు పర్యవేక్షకుల నుంచి క్రమంగా నమూనాలు తీసుకొని హెచ్5ఎన్1 పరీక్షలు నిర్వహించాలని తెలిపింది.

# పదేళ్ల తెలంగాణ



**(మొదటిపేజీ తరువాయి)**

ఆస్తులు, అప్పులను ఎలా విభజించాలో నిర్ణయించింది .

**31 సార్లు సంప్రదింపులు జరిపినా...**

విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 లోని రెండురాష్ట్రాల మధ్య సంస్థల విభజన పదేళ్లు అయినా త్రిశంకు స్వర్గంలోనే ఉంది. కేంద్రం మధ్యవర్తిగా ఉంటూ పలు అంశాలపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో 31 సార్లు సమీక్షలు జరిపామని పార్లమెంట్‌లోనే కేంద్రం పేర్కొంది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో జరిపిన తాత్కాలిక నదీ జలాల కేటాయింపులనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణకు సగం వాటా రావాలని పోరాడుతున్నా కేంద్రం పరిష్కారం చూపించలేదు. 201415వ సంవత్సరంలో తెలంగాణకు రావాల్సిన సీఎస్ఎస్ నిధులు రూ.495 కోట్లను కేంద్రం పొరబాటున ఏపీకి బదలాయించింది. వాటిని వెనక్కి ఇప్పించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఇదే కాకుండా ఆదరాబాదరగా తెలంగాణలోని ఏడు జిల్లాలను ఏపీ కలిపి అన్యాయం చేసిందని తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

**బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు ఏది?**

తెలంగాణ పురోగతి కోసం ఖమ్మంలోని బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని కేంద్రం స్పష్టంగా విభజన చట్టంలో పేర్కొంది. పదేళ్లు గడచినా స్టీలు ఫ్యాక్టరీ ఏర్పాటులో ఇంతవరకు ఎలాంటి ముందడుగు పడలేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి, తెలంగాణలో యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ తాను పార్లమెంటులో పలుసార్లు ప్రస్థావించినా కేంద్రం నుంచి స్పందన లేదు. విభజన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో తెలంగాణ వాణిని వినిపించినా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు**

తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఏటా రూ.450 కోట్లు ఇస్తామని విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది.ఈ హామి ఇచ్చి పదేళ్లు గడచినా కేవలం నాలుగేళ్లకు మాత్రమే నిధులు ఇచ్చింది. ఇంకా 201415, 201920, 202122, 202223కు సంబంధించిన ఐదేండ్ల నిధులు తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సి ఉంది.

**కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ హామీ**

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని పెడతామని కేంద్రం స్వయంగా విభజన చట్టంలో హామీ ఇచ్చింది.ఈ హామీని తొమ్మిదేళ్లు నానబెట్టి చివరికి రైల్వే వ్యాగన్ ఉత్పత్తికి కేంద్రం అంగీకరించింది. ఇటీవల ప్రధాని మోదీ కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

**తెలంగాణ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఏది?**

తెలంగాణలో ఏదైనా ఒక సాగునీటిపారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుకుగానీ, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకుగానీ జాతీయ హోదా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ఎన్నిసార్లు కోరినా కేంద్రం నుంచి ఫలితం లేదు.

**నీళ్లు,నిధులు,నియామకాలు అందేదెన్నడు?**

నీళ్లు,నిధులు,నియామకాలు. ఇవే ప్రధాన ఎజెండాలుగా యావత్ తెలంగాణ ఉద్యమం వచ్చింది. తెలంగాణ ఆవిర్భావంతో మన నిధులు, మన నీళ్లు, మన ఉద్యోగాలు మనకే దక్కుతాయని, మన వనరులు మనమే పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చని నాలుగు కోట్ల మంది ప్రజలు ఎంతో ఆశపడ్డారు. సబ్బండ వర్ణాల పోరాటం,అమరుల త్యాగ ఫలంతో 2014 జూన్ 2 న ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది.పదేళ్లు అయినా తెలంగాణ ప్రజల ఆశలు నెరవేరలేదు. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు అయిన సందర్భంగా తెలంగాణలో ఏర్పడిన రేవంత్ రెడ్డి సర్కారు హయాంలో నైనా తమ ఆశలు నెరవేర్చాలని తెలంగాణ వాదులు కోరుతున్నారు.

**గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏది..?**

**కొత్త తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్‌ను శాశ్వత రాజధానిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తాత్కాలిక రాజధానిగా హోదాను నిర్దేశించింది. "ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చాం" అంటూ గతంలో పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ ఈ ప్రకటనపై తెలంగాణ నేతలు,ప్రజలు మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తి అయినా విభజన హామీలు మాత్రం నెరవేరలేదు. విభజన హామీల్లో గిరిజన విశ్వవిద్యాలయం ఒక్కటే నెరవేర్చారు. ములుగులో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్శిటీ కోసం 331 ఎకరాలను, తాత్కాలిక వసతి కోసం భవనాలను కేటాయించింది.**

# సీఎం రాష్ట్ర చిహ్నం మార్చకపోవడమే మంచిది

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచన చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా రూపొందించడం అభినందనీయమని... అయితే రాష్ట్ర చిహ్నం మార్చకపోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. రేవంత్ రెడ్డి రాష్ట్ర చిహ్నం జోలికి వెళ్లకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. రాష్ట్ర గీతం కంపోజ్ చేయానికి కీరవాణిని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడితే తప్పేమిటి? అని ప్రశ్నించారు. కళలకు ప్రాంతీయ భేదాలు ఉండవ



న్నారు. కళలకు హద్దులు గీయడం సరికాదన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ ధ్యానం చేయడమంటే కన్యాకుమారిని కలుషితం చేయడమేనని విమర్శించారు.

**వైసీపీ గెలిచే అవకాశాలు లేవు**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కూడా నారాయణ స్పందించారు. వైసీపీ గెలిచే అవకాశాలు లేవని జోస్యం చెప్పారు. కావాలనే విశాఖలో ప్రమాణస్వీకారం అంటూ వైసీపీ నేతలు హడావుడి చేస్తున్నారని విమర్శించారు. కౌంటింగ్ గురించి కూడా వైసీపీ నేతలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారన్నారు. దానిని బట్టే వైసీపీ ఓడిపోతుందని అర్థం చేసుకోవచ్చునన్నారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి రాకపోతే టీడీపీ అధినేత చంద్రబాబు ఇండియా కూటమితో జత కట్టాలని కోరుకుంటున్నానన్నారు.

# కేపీటప్.. పదవుల్ని గడ్డిపరకల్లా వదిలేశారు

- కొండూరి రవీందర్ రావు, గొంగిడి మహేందర్ రెడ్డిలను అభినందించిన కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర సహకార బ్యాంకు పదవులకు రాజీనామా చేసిన కొండూరి రవీందర్ రావు, గొంగిడి మహేందర్ రెడ్డిలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. పదవులు కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి వచ్చినప్పటికీ వారు పదవులనే వదిలేశారన్నారు.'తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమంటూ, అవసరమైనప్పుడు పదవులను గడ్డిపరకలా వదిలివేయడం నేర్పిన కేసీఆర్ గారి బాటలో... ఈరోజు తమ పదవులకు రాజీనామా చేసిన శ్రీ కొండూరి రవీందర్ రావు గారు, గొంగిడి



మహేందర్ రెడ్డి గారి నిర్ణయం అభినందనీయం' అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరి పదవులు కాపాడుకోవాలని ఎన్ని ప్రలోభాలకు, ఒత్తిడిలకు గురిచేసినా లొంగకుండా... నమ్మి నడిచిన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ బాటకే జై కొట్టారన్నారు. తమ పదవీకాలంలో రాష్ట్రంలో సహకార బ్యాంకులను అద్భుతంగా నడిపిన వీరి పేరు రాష్ట్ర సహకార రంగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పదివేల కోట్ల రూపాయల రుణాలతో ఉన్న టెస్కాబ్‌ను రూ.42,000 కోట్ల సంస్థగా తీర్చిదిద్ది, వినియోగదారుల సంఖ్యతో పాటు, డిపాజిట్లను మూడు రెట్లు పెంచి నమ్మకమైన సంస్థలుగా తయారు చేశారని కితాబునిచ్చారు. టెస్కాబ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపారని, టెస్కాబ్ అనేక అవార్డులతో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్ నిలిచిందన్నారు.వీరి రాజీనామా, నాయకత్వ లేమి రాష్ట్ర కోపరేటివ్ రంగానికి తీరని లోటు అవుతుందన్నారు. అత్యుత్తమంగా పనిచేస్తున్న ప్రజాప్రతినిధులను కుట్రపూరితంగా పక్కకు తప్పించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

# మెడికల్ మాఫియా

**(మొదటిపేజీ తరువాయి)**

జ్వరం వచ్చిందని వెళ్లిన వారిని సైతం ప్లేట్ లెట్ కౌంట్ తగ్గిందని, డబుల్ టైఫాయిడ్ అంటూ రకరకాల పేర్లు చెప్పి.. తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ తరహా మెడికల్ మాఫియా దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యం.. ప్రైవేటు హాస్పిటల్స్‌కు వెళ్లేలా చేస్తే.. అక్కడికి వెళ్లాక ఇదే అదునుగా యాజమాన్యాలు రూ.లక్షల్లో బిల్లులు వేస్తున్నారు. పైగా వైద్యం సేఫ్‌గా అందుతుందా..? అంటే అదీ లేదు. అర్హత లేని వారితో వైద్యం చేయించడం.. పేషంట్ల ప్రాణాలతో చెలగాటమాడడం సూర్యాపేటలోని ప్రైవేటు హాస్పిటల్స్‌లో నిత్యకృత్యమే. ఇంత జరుగుతున్నా.. నియంత్రించాల్సిన వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలకే వంత పాడుతుండడం గమనార్హం.

**పుట్టగొడుగుల్లా ప్రైవేటు హాస్పిటల్స్..**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు హాస్పిటల్స్ పుట్టుకొచ్చాయి. ఏ గల్లీ చూసినా.. చిన్నపాటి హాస్పిటల్ దర్శనమిస్తుంది. ప్రధానంగా సూర్యాపేట పట్టణంలో మెడికల్ కాలేజీ ఓపెన్ అయ్యాక.. ఈ హాస్పిటల్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. నిజానికి మొదట్నుంచీ సూర్యాపేట పట్టణంలో హాస్పిటల్స్ సంఖ్య కొంచెం ఎక్కువగానే ఉండేది. దీనికి మెడికల్ కాలేజీ తోడవ్వడంతో ప్రైవేటు హాస్పిటల్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. మెడికల్ కాలేజీతో పాటు జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, వైద్యులు దుకాణం తరహాలో ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఓపెన్ చేశారు. మెడికల్ కాలేజీ, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పనిచేసే వైద్యులు, డిపార్ట్‌మెంట్ హెడ్స్, ప్రొఫెసర్లు.. డ్యూటీ సమయంలోనే వారి ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఓపీ చూడడం.. సర్జరీలు చేయడం పరిపాటిగా మారింది. అదే సమయంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చిన వారు గంటల తరబడి వైద్యుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

**ట్రీట్‌మెంట్, మెడికల్, ల్యాబ్ దందా..**

సూర్యాపేట చుట్టూ పక్కల గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండడం మెడికల్ మాఫియాకు బాగా కలిసివస్తోంది. ప్రజలను ఆకర్షించేలా క్లీనిక్‌లను ఏర్పాటు చేసి వారి అర్హతకు మించిన వైద్యం చేస్తూ రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా ల్యాబ్, మెడికల్ హాల్ నిర్వహిస్తున్నారు. హాస్పిటల్‌కు వెళ్లిన ప్రతి పేషంటుకు అవసరం లేకున్నా.. రెండుమూడు రకాల పరీక్షలు నిర్వహించి డబ్బులు గుంజడం.. విటమిన్, కాల్షియం తదితర ట్యాబెట్లు, సిరప్‌లు రాయడం పేట వైద్యులకు వెన్నతో పెట్టిన విద్యగా మారుతోంది. చిన్నపాటి క్లినిక్‌లోనూ ఓపీ ఫీజు రూ.300పైమాటే. మరికొంతమంది ప్రైవేటు వ్యక్తులు సొంతంగా క్లీనిక్ ఏర్పాటు చేసి.. ఏరియా హాస్పిటల్, మెడికల్ కాలేజీలో పనిచేసే డాక్టర్లను రప్పిస్తున్నారు. ప్రతి ఓపీకి ఒక లెక్కగట్టి ఇస్తున్నారు. దీంతో వైద్యులు తమ చేతికి మట్టి అంటకుండానే పని జరిగిపోతుండడంతో ఒక వైద్యుడు రెండుమూడు క్లీనిక్‌ల్లో ఓపీలు చూస్తున్నారు.

**సెటిల్ చేసుకుంటున్న వైద్యారోగ్యశాఖ..**

ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్యులు బయటి నుంచి వస్తుండడం.. ప్రతి క్షణం అందుబాటులో లేకపోవడంతో కొన్నిసార్లు స్టాఫ్ నర్సు స్థాయి సిబ్బందే వైద్యం అందిస్తున్నారు. ఫోన్లలో సంబంధింత వైద్యులు ఇచ్చే సూచనల ప్రకారం.. స్టాఫ్ ట్రీట్‌మెంట్ చేస్తుంటారు. అలాంటి సమయంలో ఏదైనా ఇష్యూ జరిగితే వైద్యారోగ్యశాఖకు కాసుల పంట పండుతోంది. ఇటీవల గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ కోసం వెళ్లారు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో అతడి కండీషన్ సిరియస్ అయ్యింది. దీంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. తిరిగొచ్చాక సదరు ప్రైవేటు హాస్పిటల్‌పై బాధితుడు వైద్యారోగ్య శాఖకు కంప్లైట్ చేశారు. దీన్ని సాకుగా చూపుతూ వైద్యారోగ్యశాఖ అధికారులు సదరు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యం నుంచి రూ.3లక్షలు వసూలు చేశారు. కానీ బాధితుడికి మాత్రం నేటికీ న్యాయం జరగకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సూర్యాపేట మెడికల్ వ్యవస్థను గాడిన పెడతారా..? లేదో.. వేచిచూడాల్సిందే.

## నాయకుల్లో మొదలైన కౌంటింగ్ టెన్షన్..

**(మొదటిపేజీ తరువాయి)**

కావడంతో తిరిగి యాక్టివ్ మోడ్‌లోకి వస్తున్నారు. జూన్ 2వ తేదీన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు, జూన్ 4వ తేదీన ఎంపీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పార్లమెంట్ ఎన్నికలకు ముందు జరిగినప్పటికీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. అప్పటికే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఫలితాల ప్రభావం ఎంపీ ఎన్నికలపై ఉంటుందన్న ఉద్దేశ్యంతో లెక్కింపును జూన్ 2వ తేదీకి వాయిదా వేశారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మెజారిటీ సభ్యులున్న బీఆర్ఎస్ సైతం అదే స్థాయిలో సిట్టింగ్ సీటును కాపాడుకోవాలని పనిచేసింది. దీంతో రెండు పార్టీలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఫలితం కీలకం కానుంది.

## పాలమూరు పార్లమెంట్ ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ..

**(మొదటిపేజీ తరువాయి)**

ఇక పార్లమెంట్ ఎన్నికల విషయంలోనూ ఉమ్మడి పాలమూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. అందరి కళ్లు జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్‌పై పడింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం సుమారు 8సార్లు పాలమూరు పర్యటనకు రావడంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ, బీఆర్ఎస్ అభ్యర్థిగా మన్నే శ్రీనివాస్ రెడ్డి బరిలో నిలిచారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి మాత్రమే ప్రధానంగా ఈ ఎన్నికలో ఫోకస్ అయ్యారు. ఇక పోలింగ్ సరళిపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విజయంపై ధీమాగా ఉన్నా..కౌంటింగ్ రోజున ఫలితం ఎవరికి అనుకూలంగా వస్తుందోనన్న ఆందోళనలో ఉన్నారు నేతలు.

## కేసీఆర్‌కు అందిన ఆహ్వాన లేఖ



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఆహ్వానం అందజేశారు కాంగ్రెస్ ప్రోటోకాల్ ప్రతినిధి. కేసీఆర్ నివాసానికి వెళ్లిన ప్రతినిధులు ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఈ ఆహ్వానంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారని, వేడుకలకు హాజరవుతానని చెప్పినట్లు ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణ సర్కార్ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర అవిర్భావ వేడుకలకు కేసీఆర్ కు ఆహ్వానం అందజేశారు. ఆహ్వాన పత్రికతో పాటు సీఎం రేవంత్ లేఖను కూడా కేసీఆర్ కు అందజేశారు ప్రోటోకాల్ ప్రతినిధులు.

**హర్కర వేణుగోపాల్..**

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకమైన సందేశంతో పాటు వారు ఇచ్చిన లేఖను, ఆహ్వాన పత్రికను కేసీఆర్ కు అందజేశాం. ఇది 60 ఏళ్ల కల. పండుగ వాతావరణంలో దశాబ్ది ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబోతున్నాం. ఈ సంబురంలో అందరినీ ఇన్వాల్ చేస్తున్నాం. అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర ఉంది. ఆయనను కలిసి ప్రత్యేకంగా ఆహ్వానం పలికాం. ఆ బాధ్యతను ముఖ్యమంత్రి మాకు అప్పగించారు. జూన్ 2న అత్యంత వైభవంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు చేస్తున్నాం. కేసీఆర్ తప్పకుండా ఈ వేడుకల్లో భాగస్వామం అవుతారని ఆశిస్తున్నాం".

## 16 మీడియా ఛానళ్లపై బీఆర్ఎస్ ఫిర్యాదు



**విశ్వంభర, బంజారాహిల్స్ :** కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న పలు మీడియా ఛానళ్లపై బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో పార్టీ తరఫున బాల్క సుమన్ ఫిర్యాదు చేశారు. లిక్కర్ స్కాం కేసులో కేసీఆర్ ఇమేజ్ దెబ్బతీసేలా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో పాటు పలు మీడియా ఛానళ్లు అసత్య ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న మీడియా ఛానళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాల్క సుమన్ కోరారు. లిక్కర్ స్కాం కేసులో కేసీఆర్ పేరును ఈడీ ప్రస్తావించినట్లు నిరాధార ఆరోపణలను కొన్ని ఛానళ్లు ప్రసారం చేశాయని తెలిపారు. ఈ విషయంలో 16 న్యూస్ ఛానళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్తలు ప్రసారం చేయాలని సూచించారు. ప్రసార మాధ్యమాలు ప్రజాగొంతుకగా ఉండాలని హితవు పలికారు.

## మహిళా వైద్యురాలిపై జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్
# లైంగిక వేధింపులు

**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా ఆస్పత్రిలో లైంగిక వేధింపులు కలకలం సృష్టిస్తున్నాయి. మహిళా డాక్టర్‌పై తోటి వైద్యుడు వేధింపులకు పాల్పడుతుండటం జిల్లాలో సంచలనంగా మారింది. అతడి టార్చర్ భరించలేక బాధిత వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసంక్రిమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఆలన విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా డాక్టర్‌పై గత కొన్ని నెలలుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. డ్యూటీలో ఉన్న సమయంలో అసభ్యంగా మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. కల్యాణ్ చక్రవర్తి వేధింపులపై గతంలోనే డీఎంహెచ్‌వోకు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో మరింత రెచ్చిపోయిన కళ్యాణ్ చక్రవర్తి నేను చెప్పినట్టు వినకపోతే నిన్ను, నీ భర్తను చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. అంతటి ఆగకుండా లైంగిక వేధింపులను తీవ్రతరం చేశాడు. దీంతో విసిగిపోయిన మహిళా వైద్యురాలు ఈనెల 28న సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కళ్యాణ్ చక్రవర్తి నుంచి రక్షణ కల్పించి, అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, తనపై కేసు నమోదైన విషయం తెలుసుకున్న కళ్యాణ్ చక్రవర్తి లాంగ్ లీవ్స్ పెట్టుకోని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ కేసు విషయంపై జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే డీఎంహెచ్‌ఓకు నోటీసులు పంపించారు.

## అప్పుల బాధతో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**విశ్వంభర, మహబూబాబాద్ :** అప్పుల బాధతో రోజుకు అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అప్పు ఇచ్చిన వాళ్ల వేధింపులు, సూటిపోటీ మాటలు తాళలేక తనవు చలిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించలేక.. ఇటు చేసిన అప్పులు తీర్చలేక.. భార్యపిల్లలను అనాథలను చేసి ప్రాణాలను తీసుకుంటున్నారు. ఇందులో పేద, మధ్య తరగతి కుటుంబాలే కాదు.. ప్రభుత్వ ఉద్యోగస్తులు సమిధులవుతున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఓ పోలీస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం అందరిని కలచివేసింది. బత్తిని మనోహర్(50) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నాడు. ఇటీవల ఆయనకు అప్పులు పెరిగిపోయాయి. వచ్చే జీతంతో అప్పులు తీర్చలేక.. అప్పుల వాళ్ల బాధ భరించలేక శుక్రవారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నరసింహా నగర్‌లో మనోహర్ చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపారు. అనంతరం పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అప్పులు బాధతో గతకొంత కాలంగా మనోవేదన చెందుతున్నాడని ఆయన కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అంతేకాదు.. తోటి ఉద్యోగులు కూడా కొన్ని రోజుల నుంచి మనోహర్ డల్ గా ఉంటున్నాడని తెలిపారు. ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని మనోహర్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఇటీవల అప్పుల బాధలతో, ఆర్థిక ఇబ్బందులతో పోలీస్ డిపార్ట్మెంట్‌లో ఆత్మహత్యలు భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

## గృహిణీ అనుమానాస్పద మృతి

### కుటుంబ కలహాలే కారణమని ఆరోపణలు



**విశ్వంభర, మందమర్రి :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి ఒకటోవ జోన్ గృహిణి మర్రి (ప్రణవి) విజయలక్ష్మి (28) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం గత 2020 సంవత్సరంలో మందమర్రి పట్టణానికి చెందిన మర్రి గౌతమ్ కు హన్మకొండ కొవ్వూరు గ్రామానికి చెందిన (ప్రణవి) విజయలక్ష్మితో లాంఛనంగా వివాహం జరిగినట్లు తెలిపారు. వీరిద్దరి మధ్య పరస్పర గొడవలు జరగడంతో పట్టణ పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ తో పాటు పలువురు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీని కూడా నిర్వహించినట్లు సమాచారం. కుటుంబ కలహాల కారణంగానే అమ్మాయి మృత్యువాత పడినట్లు పలువురు కంటనీరు పెట్టారు. అత్త, మామ, భర్త, తదితరులు ఇంట్లో ఉండగానే ప్రణవి ఉరి పెట్టుకుని మరణించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలు భర్త గౌతం రామకృష్ణాపూర్ ఓపెన్ క్యాస్ట్ లో కాంటాక్ట్ కార్మికుడు డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీరు ఇరువురికి రెండున్నర సంవత్సరాలు రూపేష్ అనే కుమారుడు ఉన్నాడు. ఇదిలా ఉండగా మృతురాలు కుమారుడు రూపేష్ ఉదయం గుక్క పట్టి ఏడుస్తూ ఉండడంతో ఇంట్లో ఉన్న అత్తమామలు, భర్త, మృతదేహాన్ని చూసి ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. మృతి సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

### నా కూతురిని భర్త, అత్త, మామలే హత్య చేశారు..?

నా కూతురుని భర్త గౌతం, అత్త భాగ్యలక్ష్మి, మామ కుమారస్వామిలే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలు తండ్రి ఆరుకల రాజయ్య ఆరోపణలు చేశారు. గత 2020 సంవత్సరం లో ఎంతో వైభవంగా వివాహం జరిపించామని చెప్పారు. వివాహ సమయంలో 25 లక్షల రూపాయలు, 20 తులాల బంగారం లాంఛనంగా ఇచ్చామని వివరించారు. వివాహమైన ఆరు నెలల నుండే నా కూతురిని అదనపు కట్నం కొరకు వేధిస్తున్నాడని స్పష్టం చేశారు. వివాహం అయిన తర్వాత కూడా మరో రెండున్నర లక్షల రూపాయలు ఇచ్చినట్లు చెప్పారు. నా కూతురు మృతి విషయంలో అల్లుడు,కుటుంబ సభ్యులపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. పోలీసులు వివిధ కోణాలలో విచారణ జరిపి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### పోలీసుల భారీ బందోబస్తు

శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చిన వివాహిత ఆత్మహత్య ఉదంతంలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందని భావించి పట్టణ ఎస్ఐ రాజశేఖర్, అదనపు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మృతురాలు కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతం కుటుంబ సభ్యులపై దాడులు చేస్తారని సందేహాలు ఉండడంతో వారిని ముందస్తుగా పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. మృతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి




**విశ్వంభర, దోమ మే 31 :** మండల కేంద్రంలోని వివిధ గ్రామాల ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సూపరింటెండెంట్ నరేందర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు చెల్లించవలసిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. ప్రతీ కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పని జరిగే ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్, తాగునీరు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఉపాధి పని చేస్తూ ఎవరైనా వడదెబ్బతో ఇతర కారణాలతో చనిపోతే 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెన్నారెడ్డి, కృష్ణా, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# సమంత విడాకులకు ఫోన్ ట్యాపింగే కారణం

- హరీష్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేయించారు
- ఆర్గనైజ్డ్ క్రైమ్‌లా ఫోన్ ట్యాపింగ్ జరిగింది
- అందరి వేళ్లూ కేసీఆర్ వైపే చూపిస్తున్నాయి
- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, నాంపల్లి :** టాలీవుడ్ జంట అక్కినేని నాగచైతన్య, సమంతల విడాకులకు ఫోన్ ట్యాపింగ్ ఇష్యూనే కారణమని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీజేపీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ... మాజీ మంత్రి హరీష్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేయించి ఓ ఫైల్ రెడీ చేయించారని అన్నారు. ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్‌లా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తవ్వినా కొద్దీ కొత్త కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఇప్పటికే అరెస్ట్ అయిన నాటి సీఐడీ అధికారులు... టాస్క్ ఫోర్స్ పోలీసులకు ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్ మెంట్ లో ట్యాపింగ్ ఆపరేషన్ బహిర్గతమైంది. అందరి వేళ్లూ పెద్దాయన వైపే ఉన్నాయి. దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నికతో మొదలైన ట్యాపింగ్ ఆపరేషన్ గతేడాది అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగింది. తాజాగా ఈ వ్యవహారం వల్ల టాలీవుడ్ జంట విడాకులు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని బూర నర్సయ్య గౌడ్ వ్యాఖ్యానించడం కొత్త వివాదానికి దారి తీస్తోంది. ఇందులో ఎంత నిజముందో వేచి చూడాల్సిందే.

# భద్రాచలంలో టవేరా చోరీ

- పని చేయని సీసీ కెమెరాలు
- సత్రంలో ఆధార్ కార్డులు లేకుండానే గది కేటాయింపు



**విశ్వంభర, భద్రాచలం మే 31 :** సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల ఏం జరుగుతుందో, ఇటీవల భద్రాచలం చోటు చేసుకున్న సంఘటన ఉదాహరణగా చెప్పవచ్చు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై వివిధ వర్గాల నుంచి వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలంలోని ఒక ప్రైవేట్ సత్రానికి ఈ నేల 15 వ తేదీ రాత్రి సుమారు ఆరుగురు సభ్యులుతో ఓ కుటుంబం వచ్చింది. ఆ కుటుంబం ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు సత్రంలో ఆధార్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని, బ్యాగ్ లో ఉన్నాయని సత్రం వాళ్ళకు చెప్పినట్టు సమాచారం. అలాగే తమకు వేరే ప్రాంతానికి వెళ్లేందుకు ఒక వాహనం అద్దెకు కావాలని సత్రం వారిని కోరారు. సత్రం యజమాని ఒక టవేరా మాట్లాడి పెట్టారు. ముందుగా తాము ఆ వాహనానికి పూజలు చేయాలనీ కోరటంతో కార్ యజమాని తాళం కూడా ఇచ్చేసి వెళ్లారు. పూజలు చేసి తాళం కౌంటర్ లో ఇమ్మని వాహనం యజమాని చెప్పాడు. తాళం కౌంటర్ లో ఇవ్వకుండా, వాహనంతో సహా తెల్లవారు జామున వారు ఉడాయించారు. వారి వివరాలు లేవు, ఆధార్ కార్డులు లేవు, సీసీ కెమెరాలు పని చేయడం లేదు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2017 కంటే ముందు నుంచి ఫోన్ వ్యవహారం నడుస్తోందని కీలక ఆరోపణలు చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీని డిజాల్వ్ చేయాలని ఈసీకి లేఖ రాస్తా అని కీలక ప్రకటన చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా బాధితుడే అని గుర్తుచేశారు. నిందితులను శిక్షించకపోతే బీఆర్ఎస్, కాంగ్రెస్కు మధ్య ఒప్పందం ఉందని ప్రజలకు తెలిసిపోతుందని అన్నారు. నిందితులు ఎవరో తెలిసాక కూడా మౌనం మంచిది కాదని హితవు పలికారు. ఈ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇవాళ ఈ ఇష్యూపై హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చుతోందని ఆరోపించారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, వెంటనే సీబీఐకి అప్పగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసలైన నిందితులను పట్టుకునే ప్రయత్నం చేయడం లేదని, దీనంతటికీ కీలక సూత్రధారి మాజీ సీఎం కేసీఆరే అని విచారణలో తేలిందని అన్నారు. దోషులకు శిక్ష పడే వరకు తాము ఊరుకోము అని హెచ్చరించారు.



# ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- నిల్వ ఉంచిన మాంసము, పాల పదార్థాలు
- పలు రెస్టారెంట్లపై కేసు నమోదు

**విశ్వంభర, షాద్ నగర్ :** పెద్ద పెద్ద పేరున్న హోటల్లోకి రెస్టారెంట్ లలో తినడానికి వెళ్తున్నారా అయితే జాగ్రత్త. అక్కడ కిచెన్ లు చూస్తే మీరు ముద్ద కూడా లోపల పెట్టారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బైపాస్ పై ఉన్న పాలెగర్ , కృతుంగ, శ్రీను హోటల్ లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. అధికారులు దాడులు నిర్వహించిన క్రమంలో కుళ్ళి పోయిన నిల్వ ఉంచిన మాంసం, ఎక్స్పైర్ అయినా పాల పాకెట్లు, ఎక్స్పైరీ డేట్ సరైన లేబులింగ్ లేని పాకెటన్లు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఆహార పదార్థాలు, కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నాయని అలా శుభ్రంగా లేని పలు హోటళ్ల పైన కేసు నమోదు చేశాము అని తెలియజేశారు. డబ్బులు సంపాదించడం లక్ష్యం కాకుండా మంచి ఆహార కూడా అందించాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గుట్కా ప్యాకెట్లు సీజ్




**విశ్వంభర, పరిగి మే 31 :** అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పరిగి పట్టణ కేంద్రంలో పలు షాపుల్లో సోదాలు నిర్వహించగా నర్సింలు పాన్ షాప్ లో ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయని ఎస్ఐ తెలిపారు. వాటి విలువ సుమారు 4000 రూపాయలు ఉంటుందని, పాన్ షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఏసీబీకి చిక్కిన నీటి పారుదల శాఖ
# ఇంజనీర్లు, సర్వేయర్

**విశ్వంభర, రంగారెడ్డి :** నీటి పారుదల శాఖకు చెందిన ముగ్గురు ఇంజనీర్లతో పాటు సర్వేయర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ భన్సీ లాల్, అసిస్టెంట్ ఇంజనీరింగ్స్ కార్తీక్, నికేశ్ కుమార్, సర్వేయర్ గణేశ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. నెక్నాంపూర్‌లో ఓ భవన నిర్మాణానికి సంబంధించిన ఎన్వోసీ అనుమతి కోసం వారంతా కలిసి లంచం డిమాండ్ చేశారు. మొత్తం రెండున్నర లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ముందుగా లక్షన్నర ఇవ్వాలంటూ బాధితునికి వారు చెప్పారు. అంతేగాక, మరో 40 వేల రూపాయలు ఇవ్వాలని గణేశ్ డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖలో ఏసీబీ సోదాలు జరిపింది. లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ భన్సీ లాల్ నుంచి 65 వేలు, నికేశ్‌కుమార్ నుంచి 35 వేలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

### ఏసీబీకి దొరికిన కుషాయిగూడ ఎస్ఐ

**విశ్వంభర, కుషాయిగూడ :** ల్యాండ్ సెటిల్ మెంట్ కోసం రూ.3లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడో ఎస్ఐ. హైదరాబాద్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ షఫీ 3లక్షల రూపాయలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఓ ల్యాండ్ కేసు క్లోజ్ చేయడానికి ఎస్ఐ షఫీ రూ.3లక్షలు లంచం డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకునేందుకు ఇద్దరు వ్యక్తులను పంపగా పక్కా సమాచారంతో రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎస్ఐ షఫీని అదుపులోకి తీసుకున్న అధికారులు ఏసీబీ ఆఫీసుకి తరలించి ఎంక్వైరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా ఉన్నారా? పోలీస్ స్టేషన్ లోని ఇతరుల పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విచారణ తర్వాత ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐ షఫీ ఓ ల్యాండ్ విషయంలో భరత్ రెడ్డిని 3లక్షలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా.. సీఐకి కూడా ఇందులో వాటా కావాలని డిమాండ్ చేశాడు. ఉపేందర్ ను మధ్యవర్తిగా పెట్టి భరత్ రెడ్డి ఆఫీసులో లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నాం. వీరిపై పూర్తి విచారణ చేస్తున్నాము. ఎవరున్నా వదిలేది లేదు అని అన్నారు.




## ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు

**విశ్వంభర, ఆమనగల్లు మే 31:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో ఉన్న అధీకృత డీలర్ల ఫెర్టిలైజర్, సీడ్స్, పెస్టిసైడ్స్ షాపులను శుక్రవారం మల్టీ డిసిప్లినరీ టీం తనిఖీలు చేసింది. ఇందులో భాగంగా ఆమంగల్ మండలంలోని మండల వ్యవసాయ అధికారి ఎస్ఐ, డిప్యూటీ తహసిల్దార్ టీంగా ఏర్పడి షాపుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విత్తనాలను వాటికి సంబంధించిన ఇన్వాయిసులను, బిల్లులను, లైసెన్సులను, ధరల పట్టిక బోర్డులను తనిఖీ చేశారు. రైతులకు ఫెర్టిలైజర్, సీడ్స్, పెస్టిసైడ్స్ అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ ఎస్ఐ బలరాం నాయక్, డిప్యూటీ తహసిల్దార్ వినోద్ కుమార్, వ్యవసాయ అధికారి అరుణకుమారి, కానిస్టేబుల్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

V3 NEWS
విశ్వంభర


# 33 గ్రాముల విదేశీ డ్రగ్స్ పట్టివేత

**ముగ్గురు పై కేసు నమోదు**



**విశ్వంభర, సికింద్రాబాద్:** విదేశాల నుంచి దిగుమ తి చేసిన హైబ్రిడ్ కన్నాబిస్ మత్తు మందును తార్నాక డివిజన్ లాలాపేట పరిధిలో అమ్ము తుండగా ఇద్దరు నిందితులను ఎస్ టిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండ్ కే ప్రదీప్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైబ్రిడ్ కన్నాబిస్ (కుష్) మాదకద్రవ్యాన్ని లాలాపేటలో అమ్ముతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది మహేశ్వ ర్, అరుణ్, యాదగిరి తో కలిసి లాలాపేట బ్రిడ్జి వద్ద మాటువేసి హైబ్రిడ్ కన్నాబిస్ అమ్ము తున్న లాలపేటకు చెందిన ఆమన్ (మహమ్మ ద్ ఖాన్), మహమ్మద్ ముబీన్ లను అదుపు లోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 23 గ్రాముల కన్నాబీస్ స్వాధీనం చేసుకొని విచా రించారు. వారికి మల్కాజ్గిరి ప్రాంతానికి చెందిన నిఖిల్ నాయక్ అనే వ్యక్తి అందిం చాడని చెప్పడంతో, వెంటనే నిఖిల్ నాయక్ ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10గ్రాముల కన్నాబిస్‌ను స్వాధీన పరుచు కున్నారు. ముగ్గురు నుండి 33 గ్రాముల మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిని మహమ్మద్ అబ్దుల్ మోబిన్ బెంగళూరు కు వెళ్లి అక్కడ విదేశీయుల నుంచి కొనుగోలు చేసి , హైదరాబాద్ కు తీసుకొచ్చి మహమ్మద్ ఖాన్, నిఖిల్ నాయక్ లు కలిసి యువతకు అమ్ముతారు. దీనిని గ్రామ కు రూ,3500 చొప్పున అమ్ముతారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న 33 గ్రాముల మాదక ద్రవ్యం విలువ రూ,1.32 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మాదక ద్రవ్యాలు విదేశాల నుండి అక్రమంగా సముద్ర మార్గం ద్వారం బెంగళూరు, కొరెనూర్‌కు సరఫరా అవుతున్న ట్లు గుర్తించామన్నారు. దీనిని హిందుకుష్ పర్వతశ్రేణుల్లో , ఆఫ్రికా, అమెరికా దేశాల్లో ఎక్కువ పండిస్తారని తెలిపారు. ఉదయం చూ డడానికి గాంజాయిలా ఉన్న ఇందులో టీహెచ్సీ రసాయన పదార్థం 26 శాతం అధికంగా ఉంటుందని వివరించారు. దీనిని ఓజి, కుష్ పేర్లతో కూడా పిలుస్తారని తెలిపారు.

# భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్ మే 31:** ఓల్డ్ కొత్తపేట బస్తీ నుంచి గురు మందిర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజ్ లైన్ పనులు జల మండలి అధికారులు శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ డ్రైనేజ్ లైన్ పనులను పరిశీలించారు. ఈ క్రమంలో జీఎం బలరాంతో కార్పొరేటర్ మాట్లాడుతూ కొత్తపేట డివిజన్ లో మంజూరైన డ్రైనేజ్ లైన్ పనులు రాబోయే వర్షాకాలంలోగా పూర్తి చేయాలని కోరారు. గురు మందిర్ వద్ద పాత డ్రైనేజి లీకుతో స్థానికులు తీవ్రఇబ్బందులకు గురయ్యే వారని, నూతన డ్రైనేజ్ లైన్ మంజూరుతో శాశ్వత పరిష్కారం చేయించినందుకు కార్పొరే టర్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సూపర్వైజర్ దయాకర్ తో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని, పనైపోయిన వెంటనే మళ్ళీ యథావిధిగా రోడ్డు మరమ్మతు లు చేసేలా చూడాలని తెలిపారు. కార్పొరేటర్ తోపాటు స్థానికులు గోపాల్ యాదవ్, క్రిష్ణ యాదవ్, మదుయాదవ్, రాజు, నాయకులు అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమకారులను గుర్తించాలి

**కోదండరాంకు సేజ్స్ కాంట్రాక్టర్స్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**



**విశ్వంభర, చింతపల్లి మే 31 :** కాంట్రాక్టర్స్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2012 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు మరియు మలి దశ ఉద్యమంలో పాల్గొనిన వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులకు ప్రభుత్వం చే తగిన గుర్తింపు ఇప్పించాలని ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య తెలిపారు. సమైక్యాంధ్ర ప్రదేశ్ లో సెజ్లో తెలంగాణ పేరుతో ఏర్పాటు ఐన మొదటి మరియు ఏకైక అసోసియేషన్ అని, భారత దేశంలో ఈ అసోసియేషన్ మొదటి వరుసలో ఉందని తెలంగాణ సెజ్స్ కాంట్రాక్ట ర్స్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి తిరందాస్ అశోక్ పేర్కొన్నారు. సెజ్ ప్రాంతానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఇంటర్ పోల్ వ్యవస్థ అమలులో ఉంటుందని, సమా వేశాలు మరియు అసోసియేషన్ ఏర్పాటు నిషేధం ఉన్నా కూడా తాము తెలంగాణ పేరు మీద సెజ్ అసోసియేషన్ ఏర్పాటు చేసి జై తెలంగాణ అని మలిదశ ఉద్యమంలో పాల్గొ న్నామన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్య వర్గ సభ్యులను తాము చేసే సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాల నుంచి సంబంధిత యాజమాన్యం ఆకస్మికంగా తొలగించిన్నట్లు సంయుక్త కార్యద ర్శి పీ భీమేశ్వర్ తెలిపారు. తెలంగాణా జేఏసీ అనుబంధ సంఘమైన తెలంగాణ ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తో కలిసి తెలంగాణ వచ్చేవరకు పలు ఉద్యమ కార్యక్రమ ల్లో పాల్గొనట్లు వారు తెలిపారు. మలి దశ ఉ ద్యమంలో పాల్గొన్న అసోసియేషన్ వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులకు నేటి వరకు ప్రభుత్వం చే ఎలాంటి గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జెల్ల దర్శన్, నిత్యనందం, దుర్గేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతుంది

**గొంటి విక్రమ్ యాదవ్**

**విశ్వంభర, బషీర్ బాగ్, మే 31:** అధికారంలో ఉ ండగా ఉద్యమకారులను, తెలంగాణ గీతాన్ని అవమానించిన బీఆర్ఎస్ పార్టీ, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి దక్కుతున్న గుర్తిం పును తట్టుకోలేనీ కేసీఆర్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అవాకులు చవాకులు పెలడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్ అన్నారు. తెలంగాణ అధికారిక చిహ్నంలో రాచరిక పోకడలను అవలంబించి, అన్నం పెట్టే రైతన్నలను తెలంగాణ తొలి, మలి ఉద్యమకారుల జాడ లేకుండా చిహ్నాన్ని తయారుచేసి పది సంవత్సరాలు తెలంగాణలో చిందులేసిన బీఆర్ఎస్ కి కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం బుద్ధి చెబుతుందని చెప్పారు. అమా యక ప్రజలను రెచ్చగొడుతూ, తెలంగాణ ఉ ద్యమం తానే చేసామని ఇన్ని రోజులు చెప్పు కుంటూ పబ్బం గడిపిన కేసీఆర్ కు, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిహ్నం మార్పుతో ఉద్యమకారులకు దక్కుతున్న ప్రాధాన్యాన్ని కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతుందని ఆవేదన చెందారు. తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందంటూ విద్యార్థులు, య-ువకులను రెచ్చగొట్టి వారి మరణానికి కారణమైన కేసీఆర్ 10 సంవత్సరాలు అధికా రాన్ని అనుభవించి ఉద్యోగాల ఊసు లేకుండా ఎంతో మంది యువకుల ప్రాణాలు తీసిందని అన్నారు. అటువంటి కేసీఆర్ తో జతకట్టి నడి చిన బీజేపీ నేడు తెలంగాణ తల్లి సోనియమ్మను రాష్ట్రానికి రావద్దని ఇద్దరు ఒకటిగా మాట్లాడ టం విడ్డూరంగా ఉందని తెలిపారు. రాయల సీమ వెళ్లి రొయ్యల పులుసు తిన్న కేసీఆర్, తెలంగాణ నీళ్లను మహారాష్ట్రకు ఇస్తానన్న కేసీఆర్, తెలంగాణలోని కాంట్రాక్టులన్నీ ఆంధ్రా వాళ్లకు అప్పగించి కమిషన్లు తిన్న కేసీఆర్ ఆస్కార్ అవార్డు గ్రహీత అయిన కీరవాణి తోటి తెలంగాణ గీతానికి సంగీతం సమకూర్చితే ఆంధ్రవాడు అని అనడం గురి గింజ సామెతను గుర్తు చేస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను ప్రగతి భవన్, సెక్రటేరియట్ గేటును తాకనివ్వని కేసీఆర్ కు దొరల ఆనవాళ్లను కూకటి వేళ్ళతో పెకిలించి వేస్తున్న రేవంత్ రెడ్డి పాలనపై గొంతు చించు కోవడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉ ందని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న సోనియమ్మ కు తెలంగాణ ప్రజలమంతా స్వాగతం పలుకుతామని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్ స్పష్టం చేశారు.

# వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

- వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం
- జులై 14, 15 తేదీల్లో రంగారెడ్డి 3వ జిల్లా మహాసభలు
- ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



**విశ్వంభర, షాద్‌నగర్ మే 31 :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో బ్లాక్ ఆఫీస్ ఆవరణలో ఎన్పి ఆర్డీ రంగారెడ్డి జిల్లా కమిటీ స భ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి గా ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య హాజరై భవిష్యత్ కార్యాచరణ పై కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని, నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ సాధన కోసం మరో ఉద్యమం చేస్తామని ఎం అడివయ్య హెచ్చరిం చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి 8 ఏండ్లు గడుస్తున్నా.. నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. తీవ్ర వైకాల్యం కలిగిన వికలాం గులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని చట్టంలో ఉందని, దాన్ని అమలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మెంటల్ హెల్త్ కేర్ చట్టం 2017 ను వెంటనే అమలు చేసి ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక హోమ్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సం స్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాం గులకు రిజర్వేషన్స్ అమలు చేయాలన్నారు. రిజర్వేషన్స్ సాధన కోసం ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జూలై 14, 15 తేదీల్లో ఎన్పీఆర్డీ జిల్లా తృతీయ మహాసభలు షాద్ నగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షలు భుజంగా రెడ్డి, జెర్కోని రాజు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. మహాసభల్లో జిల్లాలో వికలాంగుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లాలో సదరం క్యాంప్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.

### ఎన్పీఆర్డీ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఎన్నిక

ఎన్పీఆర్డీ షాద్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా శేఖర్ గౌడ్, ఉ పాధ్యక్షులుగా డీ నర్సింలు, గౌసియా బేగం, శివలీల, కార్యదర్శిగా ఆబ్బె సంతోష, సహాయ కార్యదర్శులుగా శివం-ములు, కల్పన, కుసుమలతో పాటు 10మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దేవరంపల్లి రాజశేఖర్ గౌడ్, జిల్లా నాయకులు నాగార్జున, శ్రీనివాస్, లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

# సైన్సు టీచర్లతో సైన్స్ మాత్రమే చెప్పించాలి

**పోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సూర్యాపేట**

**విశ్వంభర, సూర్యాపేట :** సైన్సు ఉపాధ్యాయులను సైన్సు బోధనకే పరిమితం చేయాలని ఫోరమ్ అఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్.పీ.ఎస్.టీ) సూర్యాపేట శాఖ అధ్యక్షులు చింతరెడ్డి రామలింగారెడ్డి కోరారు. శు క్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి 6,7 తరగతులకు సంబంధిం చిన గణితమును భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధించాలని విద్యాశాఖ కార్యదర్శి మెమో నెంబర్ 11143 ద్వారా ఉత్తర్వులు విడుదల చేశారని పేర్కొన్నా రు. ఈ ఉత్తర్వులు అసమగ్రంగా ఉన్నాయని వెంటనే రద్దు చేయాలని కోరారు. జేఈఈ ఐ ఐటి నీట్ తదితర పోటీ పరీక్షలలో భౌతిక రసాయన శాస్త్రాలు కీలకంగా ఉన్నాయన్నారు. కొందరు ఉపాధ్యాయుల ఒత్తిడితో భౌ తిక శాస్త్రం ఉపాధ్యాయులపై గణితశాస్త్రం కూడా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని అది సరికాదు అని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో పోరం బాధ్యులు కె. గురుమూర్తి, చందా శ్రీను, జ్యోతుల చంద్రశేఖర్, యామా రమేష్, కందుకూరి సోమశేఖర్, రావిరాల చంద్రశేఖర్, మధు, లక్ష్మయ్య, ఎల్లయ్య, గోపయ్య పవన్‌కుమార్ పాల్గొన్నారు.

# భానుడి ప్రతాపానికి వాహనాలు దగ్ధం

**విశ్వంభర, జగిత్యాల టౌన్ :** తీవ్రమైన ఎండల ధాటికి 20 ద్విచక్ర వాహనాలు దగ్ధం అయిన ఘటన జగిత్యాల పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల అన్వేష్ అనే మెకానిక్ ఇంటి ఆవరణలో ఉన్న 20 బైక్‌లు ఎండ వేడిని తట్టుకోలేక పూర్తిగా కాలిపోయా యి. ఆ మంటలు కాస్త ఇంట్లోకి వ్యాపించగా ఇంట్లో ఉన్న సామాగ్రి కూడా దగ్ధమయింది. సమాచారం అం దుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా 10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**విశ్వంభర, షాద్‌నగర్ మే 31:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ 11కేవీ ఫరూక్ నగర్ గవర్నమెంట్ హాస్పిటల్ లైన్ లలో చెట్ల కొమ్మలు తొలగించు పనుల కారణంగా ఫరూక్‌న గర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫరూక్ నగర్, ఇస్లాంపురా కాలనీ, అడ్వకేట్ కాలనీ, మాలిక్ కౌంటీ, సైనా కౌంటీ, సీఎస్కే, గోల్డెన్ పార్క్, యాదవ్ కాలనీ, ఎస్సీ కాలనీ, ప్యారడైస్ కాలనీ, మిలీనియం టౌన్ షిప్, నాగులపల్లి , లింగారెడ్డి గూడ, ప్రాంతాల్లో శనివారం ఉదయం 10గం. నుంచి సాయంత్రం 5 గం. వరకు విద్యుత్ స రఫరా నిలిపి వేయనున్నట్లు షాద్ నగర్ టౌన్ ఏఈ జీ వినోద్ కుమార్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మస్కట్‌లో ముగిసిన డిజిటలైజేషన్ ప్రాజెక్ట్

**విశ్వంభర, బషీర్ బాగ్ మే 31:** మస్కట్లోని భారత రాయబార కార్యాలయం, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా సహకా రంతో ఒమన్లోని భారతీయ ప్రవాసుల గొప్ప వారసత్వా న్ని కాపాడేందుకు ఒక అద్భుతమైన ప్రాజెక్ట్ను ప్రారంభిం చింది. 'ది ఒమన్ కలెక్షన్ - ఆర్కైవల్ హెరిటేజ్ ఆఫ్ ది ఇండియన్ కమ్యూనిటీ ఇన్ ఒమన్' పేరుతో ఈ డిజిటలైజేషన్, మౌఖిక చరిత్ర కార్యక్రమం మే 19-27 వరకు జరిగింది. ప్రధానంగా గుజరాత్ కు చెందిన ముప్పై-రెండు ప్రముఖ భారతీయ కుటుంబాలు తమ 250 ఏళ్ల నాటి ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఒమన్ ఉ నికి. ఈ ప్రాజెక్ట్ ప్రవాసుల పత్రాలను డిజిటలైజ్ చేయడానికి ఎన్ఏఐ విదేశీ వెంచర్ అని పేర్కొంది. విదేశాలలో కమ్యూనిటీ వారసత్వాన్ని సంరక్షించడంలో ఒక చారిత్రాత్మక అడుగు. ఒమన్ సుమారు 700,000 మంది భారతీయులకు నివాసంగా ఉందని, ఒమానీ సమాజంలో లోతుగా కలిసిపోయారని తెలిపింది.

# తాగునీటి కేంద్రం ప్రారంభం

**విశ్వంభర, ఎల్బీనగర్ మే 31 :** బీఎన్ రెడ్డి డివిజన్లోని ఎన్జీవోస్ కాలనీ బస్ స్టాప్ లో తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత తాగునీటి కేంద్రానికి ముత్తుట్ ఫైనాన్స్ సంస్థ బ్లూ స్టార్ రిఫ్రిజిరేటర్స్‌ను అందజేసింది. ముత్తుట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాన్ని శుక్రవారం బీఎన్ రెడ్డి టీడీపీ అధ్యక్షుడు, సోషల్ వర్కర్ గద్దె విజయ్ నేత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, జీఎం విజయ్, రమాదేవి, ముత్తు సంస్థ మేనేజర్ వీ సంపత్, సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ లోకేశ్, రాముడు, మహేందర్ మరియు ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ పంపన వెంకటేశ్వర్, పీవీ సత్యనారాయణ, సుబ్బారావు, కోటేశ్వరరావు, కశ్య ప్రసాద్, కిషోర్ గౌడ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రికెట్ కిట్ పంపిణీ

**విశ్వంభర, డిండి మే 31 :** డిండి మండల కేంద్రంలో ఎన్ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ ఆధ్వర్యంలో డిండి గ్రామ క్రీడాకారులకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పున్న దినేష్ మాట్లాడుతూ ఎన్ఎస్ యూఐ ఎల్లవేళలా విద్యార్థులకు, యువతకు అందుబాటులో ఉ ంటుందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్య క్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేఖ్య నాయక్, బాదామోని శ్రీనివాస్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అవుట మల్లేష్, ఖయ్యూం, మాజీ వార్డు సభ్యులు బాలయ్య, కృష్ణయ్య, ఎన్ఎస్ యూఐ డిండి పట్టణ అధ్యక్షులు అజయ్, ఫసీన్, అంజి, శివప్రసాద్, సాయి, సన్నీ, ఉత్కంట్, యువకులు పాల్గొన్నారు.









# ధర్నాలో పాల్గొన్న బీజేవైఎం నాయకులు

**విశ్వంభర, ఆమనగల్లు మే 31:** హైదరాబాదులో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ ధర్నాకు కల్వకుర్తి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో బీజేవైఎం నాయకులు తరలి వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం శాఖ రాష్ట్ర, జిల్లా, తాలూకా నాయకులతో కలిసి మొదటగా రామకృష్ణ మఠం నుంచి ధర్నా చౌక్ ఇందిరా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, బీజేవై ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, భగీరథ, జిల్లా అధ్యక్షుడు యాదిష్, బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్, మధు, సురేష్, మహేష్, రాజేష్, మల్లికార్జున్, విజేందర్, గోపాల్ పాల్గొన్నారు.



# విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

**తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**విశ్వంభర, అమనగల్లు మే 31 :** తలకొండపల్లి మండలం ఖానపూర్ గ్రామంలో నిర్వహించిన (జేఎస్ డాన్స్అకాడమీ) వేసవి డాన్స్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సాంస్కృతిక కళలను ప్రోత్సహించాలని, పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను ఇటువంటి వేదికల ద్వారా వెలికితీయాలని కోరారు. దానికోసం తన వంతు సహాయంగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సరితా గణేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, డాన్స్ అకాడమీ డైరెక్టర్ శేఖర్, వడ్డెమోని శివకుమార్, సతీష్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది



**విశ్వంభర, పరిగి మే 31 :** వికారాబాద్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు ఆదేశానుసారం నెల రోజులుగా మండల పరిధిలోని మిట్ట కోడూరు గ్రామంలో విద్యార్థులు సమ్మర్ క్యాంపులో 120 మంది విద్యార్థిని, విద్యార్థులకు కోచ్ లు బుగ్గయ్య, వెంకటేష్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ కొనసాగుతుంది. కరాటే శిబిరాన్ని శుక్రవారం యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో అమ్మాయిలకు కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మహిళలపై జరిగే దాడులు, అగైత్యాలను ఎదుర్కోవడానికి చైతన్యవంతులుగా తయారు చేయడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విద్యార్థులు విజయ్ కుమార్, దేవరాజు, దివ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్‌లో కుస్తీ పోటీలు

**విశ్వంభర, నారాయణ ఖేడ్ మే 31:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర పురస్కరించుకొని శుక్రవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల మల్ల యోధులతోపాటు పరిసర మండల గ్రామాల ప్రజలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కుస్తీ పోటీలను తిలకించడానికి పేట మండలం తోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాణిక్ ప్రభు దేవాలయంలో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం..

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రగోత్తంరెడ్డి**

**విశ్వంభర, నారాయణఖేడ్ మే 31:** ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ఉపాధ్యాయులు నడుం బిగించాలని, ప్రభుత్వం లక్ష్యం మేరకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలలను బలోపేతం చేయడానికి నడుం బిగించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రగొత్తంరెడ్డి, పీఆర్ టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను తొందర్లోనే పరిష్కరిస్తుందని ఆశాభవం వ్యక్తపరిచారు. జూన్ రెండో వారంలో ఉపాధ్యాయ ప్రమోషన్స్, బదిలీలు జరుగుతాయని, ఈ షెడ్యూల్లోనే పండిట్ పీఈటీ అప్ గ్రేడేషన్ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు టెట్ లేకుండానే పదోన్నతులు ఉంటాయని వారు పేర్కొన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతున్న తరుణంలో ఉపాధ్యాయులంతా బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలను మరింతగా బలోపేతం చేయాలని వారు కోరారు.



ఆమనగల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకుడు నాగిళ్ల వెంకటేష్ తల్లి పుష్పలత మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి
**– విశ్వంభర, ఆమనగల్లు**

# ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ రాహుల్ రాజ్**



**విశ్వంభర,టేక్మాల్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు తుది దశలో ఉన్నాయని నాలుగు రోజుల్లో జిల్లాలో అన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తి గా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం నాడు మెదక్ జిల్లా టేక్మల్ మండలంలోని సాలోజీ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సీజన్లో సాలోజిపలి కొనుగోలు కేంద్రంలో 160 రైతుల నుంచి 4812.40 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసిన ట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రంలో మిగిలి ఉన్న ధాన్యాన్ని రెండు రోజుల్లో కొనుగోలు పూర్తి చేసి ,మిల్లులకు తరలించాలని నిర్వహకులకు ఆదేశించారు. గత యాసంగి సీజన్లో జిల్లాలో ఈరోజు నాటికి 2,07, 949.720 మెట్రిక్ టన్ను ల ధాన్యం కొనుగోలు చేశామని, 410 కొనుగోలు కేంద్రాలలో యాభై రెండు (52) కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం కొనుగోలు పూర్తి చేసారు. కానీ ప్రస్తుతం జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2,69,794.760 మెట్రిక్ టన్నుల వరిధాన్యం 65791 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రూ. 473.48 కోట్ల రూలను చెల్లించినట్లు తెలిపారు. 318 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యిందని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని బాద్నాం చేయడానికే విత్తన రాజకీయం

- ప్రతిపక్షాలపై కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి ఫైర్



**విశ్వంభర, అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో రైతుల కు అందుబాటులో అన్ని రకాల విత్తనాలు ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు విత్తన రాజకీయం చేస్తూ, ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నాయని కిసాన్ కాంగ్రె స్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. ఆది లాబాద్ జిల్లాలో రాసి 659 విత్తనం కోసం జరుగుతున్న ఆందోళన దృష్ట్యా శుక్రవారం ఆయన ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా రైతులకు ఆందోళన చెందవద్దని విత్తనాలు అన్ని విధాలుగా అందుబాటులో ఉన్నాయని భరోసా కల్పించారు. ఈ మేరకు జిల్లాలో సీడ్స్ కొరత లేకుండా చూడాలని కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు.అయితే ఒకేరకం కాకుండా అన్నిరకాలు వేసుకుంటేనే అధిక దిగుబడులు వస్తాయని ఆదిశగా వ్యవసాయ అధికారులు అన్నదాతలకు అవగాహన కల్పించాలని సూచన చేశారు. రైతులు కోరుకునే డిమాండ్ రకం విత్తనాలతో పాటు ఇతర అన్ని రకాల కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాలో విత్తనాల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ ను కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని,విత్తన దుకాణాల వద్ద బారులు తీరకుండా అవసరమైన విత్తనాలను తెప్పించే విధంగా చొరవ చూపాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు అండగా ఉంటారని అన్నా అన్వేష్ రెడ్డి బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకొని రైతులకు అండగా నిలవాలని అన్నారు.

# రైతులకు విత్తనాలు అందించడంలో జాప్యం జరిగితే కఠిన చర్యలు

- అధిక ధరలకు విక్రయించిన చర్యలు తప్పవు..
- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో తనిఖీలు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల



**విశ్వంభర, తల్లాడ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే పిల్లి పెసలు, జిలుగులు, జనుములు, పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి రైతుకు అందే విధంగా కృషి చేయాలని అలాగే విత్తనాల పంపిణీ లో ఎలాంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత రెండు రోజుల క్రితం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమంలో రైతులకు విత్తనాలు అందలేదని ఫిర్యాదు పై జెడి సమగ్రంగా విచారణ చేపట్టారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు అన్ని సహకార సంఘాలకు విత్తనాలను సరఫరా చేయడం జరిగిందని అన్నారు. ప్రతి రైతుకు తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు ఆన్లైన్ చేసి సహకార సంఘాల ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా విత్తనాలను బ్లాక్ మార్కెట్కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆన్లైన్ చేసిన ప్రతి రైతుకు విత్తనాలు అందించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ ధరలకే విత్తనాలను అమ్మాలని కోరారు. ఖమ్మం జిల్లాలో పత్తి సాగు కోసం 5.60 లక్షల పత్తి విత్తనాలు తెప్పించాలని నిర్ణయించడం జరిగింది. ఇప్పటివరకు 4 .50 లక్షల పత్తి విత్తనాలు ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అదనంగా 1.60 లక్షల ప్యాకెట్ల సిద్ధం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ పాషా,సందీప్ వ్యవసాయ శాఖ ఏడి నరసరావు,ఏవో తాజుద్దీన్, సహకార సంఘం సీఈవో నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

**మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి**

**విశ్వంభర, చింతపల్లి మే 31:** మండల పరిధిలో పీకే మల్లేపల్లి, కిష్టరాయినిపల్లి, మల్లారెడ్డిపల్లి, హరిజనాపురం, సాయిరెడ్డిగూడెం గ్రామాల్లో పత్తి విత్తనాలు కొనే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని శ్రావణ కుమారి మాట్లాడుతూ.. పత్తి పంటలో యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు ఆధారపడి ఉంటాయని, పత్తిలో హైబ్రిడ్ రకాలన్ని ఒకే తరహా దిగుబడులు ఇస్తాయని, వర్షాధారంగా పంటను సాగు చేసే రైతులు మధ్యస్థ కాయలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వసతి ఉన్నచోట మరియు నల్ల భూముల్లో పెద్ద కాయలు వచ్చే హైబ్రిడ్ రకాలను ఎంపిక చేసుకోవాలని, ఎవరూ ఒకే రకమైన విత్తనాల కొరకు పోటీ పడాల్సిన అవసరం లేదని రైతులకు ఆమె సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మధు, అరుణ, మాధురి, మౌనిక మరియు రైతులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్ఓసీ అందజేత

**విశ్వంభర, ఆమనగల్లు, మే 31:** కిడ్నీలు పనిచేయక అనేకమంది అనేక రకాలుగా బాధపడుతున్నారని గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ జిల్లా సభ్యుడు కడ్తాల్ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలం సాలార్పూర్ గ్రామానికి చెందిన కావలి సాయిలు గత కొన్ని రోజులుగా కిడ్నీలు పనిచేయక బాధపడుతున్నాడు. బాధితుడికి సీఎంఆర్ఎఫ్ కింద నాలుగు లక్షల పదివేల రూపాయల ఎల్ఓసీని ఇప్పించడంతో నిమ్స్ హాస్పిటల్ లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు. ఆయనకు మరో ఒక లక్షా అరవై వేల రూపాయల ఎల్ఓసీని, అలాగే కావలి గణేష్ కు రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసీని జడ్పీటీసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రియ రమేష్, మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్, నాయకులు గోపాల్, సీతారామ్ నాయక్, జైపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

**విశ్వంభర, ఆమనగల్లు మే 31:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చెవిటి వెంకటయ్య ఆనారోగ్యంతో మరణించారు. ఎంపీటీసీ రఘు ద్వారా సమాచారం తెలుసుకున్న జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ.. తక్షణ సహాయంగా తన ట్రస్టు ద్వారా రూ.3000 అందజేశారు. జడ్పీటీసీ వెంట దేవుని పడకల్ (పెద్దూర్ ) ఎంపీటీసీ సభ్యుడు మూడావత్ రఘు నాయక్, గ్రామ పెద్దలు శ్రీశైలం, శ్రీను, విజయ్, మహేష్ , మహేందర్, మల్లేష్, మహేష్, శ్రీను ఉన్నారు.



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

# రాశి ఫలాలు

**26-05-2024 నుండి 01-06-2024 వరకు**



**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.



**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా అలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.



**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.



**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.




**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.



**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.



**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.




**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.



**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.



**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.



**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.

## అక్షరాల రూ.1100 కోట్లు

**విశ్వంభర, ఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు 2024 నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ రికార్డు స్థాయిలో ఏకంగా రూ.1100 కోట్ల విలువైన నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో సీజ్ చేసిన రూ. 390 కోట్లతో పోలిస్తే ఇది 182 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ వర్గాలు వెల్లడించాయి. మే 30 నాటికి దేశవ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు, ఆభరణాల విలువ సుమారు రూ.1100 కోట్లు ఉండొచ్చని తెలుస్తోంది. ఢిల్లీ, కర్ణాటకలో అత్యధిక నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో రూ.200 కోట్లు చొప్పున, తమిళనాడులో రూ. 150 కోట్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలో ఉమ్మడిగా రూ. 100 కోట్ల పైచిలుకు నగదు, నగలు సీజ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. కాగా కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల తేదీలను మార్చి 16న ప్రకటించగా.. ఆ రోజు నుంచే దేశవ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఆదాయపు పన్ను శాఖ అధికారులు నిఘా పెట్టారు. అప్రమత్తంగా వ్యవహరించి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఉపయోగించ దలచిన నగదు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈసారి మద్యం, ఉచితాలు, డ్రగ్స్, నగలు, ఇతర వస్తువుల తరలింపుపై కూడా ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. అక్రమ నగదు తరలింపును ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు అన్ని రాష్ట్రాల్లో 24 గంటలపాటు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసింది.

## భర్తకు కరెంట్ షాక్ ఇచ్చిన భార్య..

**ఫోన్ తీసుకున్నాడనే కోపంతో దాడి**

**విశ్వంభర, ఉత్తరప్రదేశ్:** స్మార్ట్ ఫోన్ సంసారంలో చిచ్చుపెడుతోంది. ఇప్పుడు ఓ భార్యను క్రూరంగా మార్చేసింది. చివరకు తన భర్తకు కరెంట్ షాక్ ఇచ్చే వరకు తీసుకెళ్లింది సదరు భార్య ఫోన్ పిచ్చి. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురిలో ఈ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వార్త సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన బేబీ యాదవ్, ప్రదీప్ సింగ్ భార్యా భర్తలు. వారికి 14ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. కాగా, బేబీ యాదవ్ గత కొంత కాలంగా మొబైల్ ఫోన్‌కు బాగా అలవాటుపడిపోయింది. గంటల తరబడి ఫోన్‌లోనే కాలం గడుపుతోంది. భర్త పలుమార్లు మందలించాడు. అలవాటు మానుకోవాలని హెచ్చరించాడు. అయినా వినకపోవడంతో ఆమె తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దానికి వారు ఆమె నుంచి ఫోన్ తీసుకోవాలని సలహా ఇచ్చారట. దాంతో అతడు ఆమె ఫోన్‌ను తీసుకున్నాడు. అంతే.. ప్రదీప్ సింగ్‌పై ఆమె ఆగ్రహంతో రగిలిపోయింది. భర్తకు మత్తుమందు ఇచ్చింది. అనంతరం కుర్చీకి కట్టేసి విచక్షణా రహితంగా కొట్టింది. అంతటితో ఆగకుండా పలుమార్లు కరెంట్ షాక్ పెట్టింది. అడ్డుకోబోయిన తన కుమారుడిపై కూడా దాడి చేసింది. అయితే ఎలాగోలా అమె నుంచి తప్పించుకున్న ప్రదీప్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం అతను సైఫాయి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నాడు. కాగా, బేబీ యాదవ్ ప్రస్తుతం పరారీలో ఉంది.

## సినిమా థియేటర్లలో ఎన్నికల ఫలితాలు..!

**బిగ్ స్క్రీన్ పై ఎన్నికల రిజల్ట్ లైవ్ షో**




**విశ్వంభర, ముంబై :** ట్రెండ్ మారుతోంది. అందుకు తగ్గట్టే ఎంటర్ టైన్ మెంట్ విధానం కూడా మారుతోంది. ఇప్పటి వరకు సినిమాలు, క్రికెట్ మాత్రమే థియేటర్లలో చూశాం. కాగా ఇప్పుడు ఎన్నికల రిజల్ట్ కూడా థియేటర్లలోకి రాబోతోంది. తాజాగా జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ఫలితాల కోసం అటు థియేటర్లు కూడా కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడబోయే జూన్ 4న థియేటర్లలో లైవ్ టెలికాస్ట్ చేయబోతున్నారు. మహారాష్ట్రలోని పలు ప్రధాన నగరాల్లోని థియేటర్లు ఇందుకు వేదిక కాబోతున్నాయి. ముంబైలోని ఎస్ఎం5 కల్యాణ్, సియాన్, కంజూర్‌మార్గ్‌లోని మూవీమ్యాక్స్ థియేటర్లు, థాణెలోని ఎటర్నిటీ మాల్, వండర్ మాల్, నాగ్‌పుర్‌లోని మూవీమ్యాక్స్ ఎటర్నిటీ, పుణెలోని మూవీమ్యాక్స్ తదితర థియేటర్లు జూన్ 4న ఎన్నికల ఫలితాలను లైవ్ టెలికాస్ట్ చేయనున్నట్టు తెలుస్తోంది. దీని కోసం ఇప్పటికే పేటీఎం వంటి వేదికల్లో బుకింగ్స్‌ను ప్రారంభించారని సమాచారం. ఆ రోజు ఆరు గంటల పాటు ఫలితాలను థియేటర్లలో లైవ్ స్ట్రీమ్ చేయనున్నారని తెలుస్తోంది. ఇందుకోసం టికెట్ ధరలు కూడా ఖరారయ్యాయి. రూ.99 రూపాయలు మొదలుకొని రూ.300 వరకు టికెట్ రేట్లను ఫిక్స్ చేశారు. దీనికి ఆడియెన్స్ నుంచి రెస్పాన్స్ కూడా బాగానే వచ్చింది. ఇప్పటికే కొన్ని థియేటర్లలో ఫలితాల ప్రదర్శనకు హౌస్‌ఫుల్ అయినట్లు తెలుస్తోంది. టికెట్ బుకింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి.

## తల్లి పాలతో వ్యాపారం..

- రూ.500 చొప్పన అమ్మకం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో వెల్లడి..



**విశ్వంభర, చెన్నై :** చివరకు తల్లి పాలతో కూడా వ్యాపారం చేస్తున్నారు కొందరు అక్రమార్కులు. తల్లి పాలను మార్కెట్ లో అమ్మొద్దనే చట్టాలు ఉన్నాసరే అందుకు విరుద్ధంగా కొందరు ఈ దారుణానికి పాల్పడుతున్నారు. ఈ ఘటన చెన్నైలో చోటు చేసుకుంది. నగరంలో కొందరు తల్లి పాలతో వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. 200మిల్లీ లీటర్ల తల్లిపాలు వెయ్యిరూపాయలు వరకు అమ్ముతున్నట్టు వారి దాడుల్లో వెల్లడైంది. ఈ అక్రమ దందాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు రావడంతో చట్టవిరుద్ధంగా తల్లిపాలను విక్రయిస్తున్న షాపులపై దాడులు నిర్వహించారు. మాధవరంలో తల్లి పాలను 200మిల్లీ లీటర్లకు రూ.500 చొప్పున అమ్ముతున్న దుకాణంపై దాడి చేశారు. ముత్తయ్య అనే వ్యక్తికి చెందిన వ్యాక్సిన్ స్టోర్‌ను సీల్ చేశారు. 50 బాటిళ్ల తల్లి పాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనపరుచుకున్న చేసిన తల్లి పాలను పరీక్ష కోసం చెన్నై గిండీలోని కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ & రీసెర్చ్‌కు పంపారు. ముత్తయ్య తల్లి పాలను ఎలా పొందాడు, ఎన్నాళ్ల నుంచి ఈ వ్యాపారం కొనసాగిస్తున్నాడు అనే దానిపై దర్యాప్తు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా తల్లిపాల విక్రయాలను నిషేధిస్తున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి మరోసారి స్పష్టం చేశారు.

# నా తల్లిదండ్రులు జాగ్రత్త..!

- ఈ సారి ఎంతకాలం జైలులో ఉంటానో తెలియదు
- నేను వచ్చేంత వరకు పథకాలన్నీ కొనసాగుతాయి
- జైలులో నన్ను చిత్రహింసలకు గురి చేస్తారు
- అయినా నేను వాళ్లకు లొంగేది లేదు
- ఢిల్లీ ప్రజలకు సందేశం పంపిన సీఎం కేజ్రీవాల్



**విశ్వంభర, ఢిల్లీ:** మరో రెండు రోజుల్లో జైలుకు వెళుతున్నానని, ఈ సారి జైల్లో ఎంతకాలం ఉంచుతారో తెలియదు. కానీ నేను వచ్చే వరకు పథకాలన్ని కొనసాగుతాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేసిన ఆయన ప్రజలకు సందేశం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారానికి సుప్రీంకోర్టు నాకు 21 రోజుల సమయం ఇచ్చిందని, అది ముగియడంతో ఎల్లుండి నేను తిరిగి తీహార్ జైలుకు వెళ్తాను అని చెప్పారు. ఈసారి నన్ను ఈసారి ఎంతకాలం జైలులో ఉంచుతారో నాకు తెలియదు. కానీ నియంతృత్వం నుండి దేశాన్ని రక్షించడానికి జైలుకు వెళుతున్నందుకు గర్విస్తున్నానన్నారు.

**నేను ఎక్కడ ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయి**

ఈ సారి నేను లొంగిపోవడానికి దాదాపు 3 గంటలకు నా ఇంటి నుండి బయలుదేరతానని, ఈసారి వారు నన్ను ఇంకా ఎక్కువగా హింసించవచ్చు, కానీ నేను తలవంచను అని తేల్చి చెప్పారు. నేను ఎక్కడ ఉన్నా.. మీ ఉచిత విద్యుత్, మొహల్లా క్లినిక్‌లు, ఆసుపత్రులు, ఉచిత మందులు, చికిత్స, 24 గంటల కరెంటు మరియు అనేక ఇతర విషయాలు కొనసాగుతాయని, అలాగే నేను తిరిగి వచ్చిన తర్వాత నేను ప్రతీ తల్లి, సోదరికి ప్రతి నెల రూ 1000 ఇవ్వడం ప్రారంభిస్తానని స్పష్టం చేశారు. ఇక ఈ రోజు నేను నా కుటుంబం కోసం మీ నుండి ఒక విషయం అడగాలనుకుంటున్నాను అని, నా తల్లిదండ్రులు చాలా పెద్దవారు. మా అమ్మ చాలా అనారోగ్యంతో ఉంది. జైలులో ఉన్నా కూడా ఆమె గురించి నేను చాలా ఆందోళన చెందుతున్నానని, నా తర్వాత నా తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని, వారి కోసం ప్రార్థించాలని ప్రజలను కేజ్రీవాల్ కోరారు.

**జైలులో చిత్రహింసలు పెట్టారు**

నేను జైలులో ఉన్నప్పుడు వారు నన్ను లొంగదీసుకోవడానికి ప్రయత్నించారు, కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని తెలిపారు. నన్ను జైల్లో ఎన్నో రకాలుగా చిత్రహింసలకు గురి చేశారని, నా మెడిసిన్ కూడా నిలిపివేశారని, వారు ఎందుకు అలా చేశారో.. వారికి ఏం కావాలో నాకు అర్థం కాలేదన్నారు. నేను జైలుకు వెళ్లినప్పుడు నా బరువు 70 కిలోలు ఉండగా.. ఇప్పుడు 64 కిలోలకు వచ్చిందని, ఈ వ్యక్తులు ఏమి చేశారో నాకు తెలియదు కానీ నేను జైలు నుంచి విడుదల అయినప్పటి నుంచి బరువు పెరగడం లేదని తెలిపారు. డాక్టర్లు పలు రకాల టెస్టులు చేసి.. ఇది శరీరంలో ఏదో ఒక తీవ్రమైన వ్యాధికి సంకేతంగా ఉందని తెలిపారని అన్నారు.




## ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

**విశ్వంభర, ఢిల్లీ :** నేడు లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత రానున్న ఎగ్జిట్ పోల్స్‌పై కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. శనివారం సాయంత్రం నిర్ణీత సమయం కంటే ముందు ఫలితాలను ఇవ్వకూడదని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. నేటి సాయంత్రం 6.30 గంటల తర్వాతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాలని తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాలని పేర్కొంది. లోక్ సభ ఎన్నికలతో పాటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, అలాగే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలలోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. నేటి వరకు ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఈసీ బ్యాన్ చేసింది. పూర్తిస్థాయిలో పోలింగ్ ముగిసిన తర్వాతే అంచనాలు వెల్లడించాలని పేర్కొంది.

## 45 గంటల సుదీర్ఘ ధ్యానంలో మోదీ..



**విశ్వంభర, కన్యాకుమారి :** 131ఏళ్ల క్రితం స్వామి వివేకానంద ధ్యానం చేసిన ప్రదేశంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 45 గంటల సుదీర్ఘ ధ్యాన ప్రక్రియ చేపట్టారు. గురువారం రాత్రి మొదలైన ఈ ధ్యానం శనివారం సాయంత్రం వరకు కొనసాగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కన్యాకుమారిలో వెలసిన స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద గురువారం సాయంత్రం నుంచి ధ్యానంలో కూర్చున్న విషయం తెలిసిందే. ఆయన ఇక్కడే 45 గంటలపాటు ఈ మెడిటేషన్ చేయనున్నారు. గురువారం సాయంత్రం 6.45 గంటల సమయంలో మోదీ ధ్యానం ప్రారంభించారు. ఈ సమయంలో ఆయన కేవలం ద్రవాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం మోదీకి అందుబాటులో ఉంటాయి. ఈ సమయంలో ఆయన మౌనంగా ఉంటారు. మెడిటేషన్ హాల్ నుంచి 45 గంటల వరకు ఆయన బయటకు రారు. ఆయన కాషాయ దుస్తులు ధరించి, ధ్యానంలో కూర్చొని ఉన్న కొన్ని ఫొటోలు ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. ఇదిలా ఉంటే.. 2019లో ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన కేదార్‌నాథ్ వద్ద గుహల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానం చేసిన విషయం తెలిసిందే.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర



**విశ్వంభర, బెంగళూరు:**

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి తనపై, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై చేతబడి చేస్తున్నారని ఆరోపించారు. కేరళలోని ఓ ఆలయంలో రాజకీయ ప్రత్యర్థులు 'అఘోరాలు', 'తాంత్రికుల' ద్వారా తాంత్రిక పూజలు చేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, కేరళలోని రాజరాజేశ్వరి ఆలయానికి సమీపంలోని ఏకాంత ప్రదేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జంతుబలితో కూడిన శత్రుభైరవి యాగం నిర్వహిస్తున్నట్లు తనకు విశ్వసనీయ సమాచారం ఉందని చెప్పారు. ఈ పూజలో పాల్గొన్న వారు దీని గురించి మాకు చెప్పారు. ఎవరెవరు దానిలో పాల్గొన్నారో మాకు తెలుసు. ఈ యాగం కోసం 21 ఎర్ర మేకలు, మూడు గేదెలు, 21 నల్ల గొర్రెలు, ఐదు పందులను బలి ఇస్తున్నట్లు తెలిసింది. రాజ కంటక, మారణ మోహనా స్తంభన యాగాలు చేసేందుకు వారు ప్రత్యేకంగా తాంత్రికులతో పూజలు చేస్తున్నారు. ఈ యాగాలు ఎవరు చేస్తున్నారో కూడా మాకు తెలుసు, వారు ఇందులో నిష్ణాతులు, వారు చేయాలనుకున్నది చేయనివ్వండి, వాళ్ళు చేతబడి పూజలు చేసిన మేము నమ్మే శక్తి మమ్మల్ని రక్షిస్తుంది. నిమ్మకాయ నిపుణులకు భయపడనని, తాను నమ్మినబంటునని, ప్రజల ఆశీస్సులే తనను, సిద్ధరామయ్యను కాపాడతాయని శివకుమార్ అన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ లేదా జేడీఎస్ నాయకులు ఈ పూజలు చేస్తున్నారా అని ప్రశ్నించినప్పుడు కర్ణాటకకు చెందిన రాజకీయ నాయకులే దీనికి కారణమని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన జూన్ 2న బెంగళూరులో శాసన సభ్యుల సమావేశం ఉంటుందని ప్రకటించారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలందరినీ దీనికి ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ వ్యవహారాలు, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించనున్నట్లు తెలిపారు.

# హిందూ మహాసముద్రంలో డ్రాగన్‌కు భారత్ చెక్



**రష్యా :** మనది ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద నావికాదళం... ఐతే శత్రుదేశాలతోపాటు సముద్రపు ఉగ్రవాదం... దొంగలు, పైరసీ ఇలా ఎన్నో సవాళ్లు ఉన్నాయి మనకు. అందుకే నేవీ ఆయుధ సంపత్తిని పెంచుకోవాలని నిర్ణయించింది కేంద్రం. ఇప్పటివరకు రష్యా తయారీ మిగ్ 29K విమానాలే నేవీ వద్ద ఉన్నాయి. వీటికి అదనంగా రాఫెల్ ఫైటర్ జెట్‌లు జతకలవడంతో సముద్ర జలాల్లో భారత్ ఆధిపత్యం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు మన దేశానికి అత్యవసరం... ప్రపంచంలో నాలుగో అతి పెద్ద నావికాదళంగా మన నేవీకి గుర్తింపు ఉన్నా... హిందూ మహా సముద్రంపై ఆధిపత్యం కోసం మనతో చైనా పోటీ పడుతోంది. కొన్ని దశాబ్దాలుగా డ్రాగన్ తన నేవీని వేగంగా ఆధునీకరిస్తోంది. చైనా నౌకాదళంలో యుద్ధ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలు, అణ్వాయుధాలను అమర్చిన సబ్‌మెరైన్స్ ఉన్నాయి. ఇదే సమయంలో మన నేవీకి రష్యాకు చెందిన మిగ్ 29కే విమానాలతోపాటు మరికొన్ని క్షిపణులు ఉన్నప్పటికీ, రాఫెల్ ఫైటర్ జెట్ల బలం అదనపు బలమనే చెప్పాలి. ప్రస్తుతం మన వద్ద ఉన్న మిగ్ 29కే విమానాల సంఖ్య 45 నుంచి 40కి తగ్గిపోయింది. ఇప్పుడు 26 రాఫెల్ యుద్ధ విమానాలతో మరింత బలం పెరిగినట్లైంది.

**2026 నాటికి రాఫెల్ మెరైన్ విమానాలు అందుబాటులోకి :**

2026 నాటికి రాఫెల్ మెరైన్ విమానాలు నేవీకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మన నావికాదళ ఆయుధాగారంలో రెండు విమాన వాహకనౌకలు ఉన్నాయి. పశ్చిమ, తూర్పు తీరంలో ఒక్కొక్క వాహకనౌకను మోహరించి శత్రు దేశాలను అదుపు చేయాలని చూస్తోంది నేవీ. ముఖ్యంగా హిందూ మహా సముద్రంలో సైనిక స్థావరాలను ఏర్పాటుచేస్తున్న చైనాకు చెక్ చెప్పాలనేది మన రక్షణశాఖ ప్రధాన కర్తవ్యంగా మారింది. ఇందుకోసమే కొంతకాలంగా యుద్ధ విమానాల కోసం అన్వేషిస్తున్న ఇండియన్ నేవీ... 2016లో ఎయిర్‌ఫోర్స్‌కు సమకూరిన రాఫెల్ యుద్ధ విమానాలను ఆధునీకరించి, నావికాదళానికి తగ్గట్టు తయారు చేయాలని డసాల్ట్ ఏవియేషన్‌ను కోరింది. దీనికి ఆ సంస్థ కూడా అంగీకరించడంతో ఫ్రాన్స్‌తో మన రక్షణ దేశం రక్షణ ఒప్పందానికి వేగంగా పావులు కదిపింది. రాఫెల్‌ఎం మన దేశ సైనిక సంపదను పెంచుతుందని అంచనా వేస్తున్నారు రక్షణ నిపుణులు. పశ్చిమాసియా నుంచి ఆగ్నేయాసియా వరకు విస్తరించిన హిందూ మహాసముద్రం మొత్తాన్ని రాఫెల్ యుద్ధ విమానాలతో కవర్ చేయొచ్చని చెబుతున్నారు. గత ఏడాది జూన్‌లో అరేబియా సముద్రంలో రాఫెల్ యుద్ధ విమానాలను పరీక్షించారు. ఐఎన్ఎస్ విక్రాంత్ డెక్‌పై నుంచి యుద్ధ విమానాన్ని పరీక్షించి, పూర్తి సంతృప్తి చెందడంతో కొనుగోలుకు ఆర్డర్ ఇవ్వాలని నిర్ణయించారు. దీనిద్వారా సముద్ర శక్తిగా ఆవిర్భవించాలని భావిస్తోంది మన నావికాదళం. మొత్తానికి రాఫెల్ డీల్‌తో నౌకాదళ సామర్థ్యం పెంచుకోవడమనే నేవీ ఆశయం కార్యరూపం దాల్చుతోంది. అంతేకాకుండా తన నేవీ బలాన్ని వేగంగా పెంచుకుంటున్న చైనాకు గట్టి షాక్ ఇచ్చినట్లైంది.

## నేడే చివరిదశ లోక్ సభ ఎన్నికల పోలింగ్..

- ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం
- మొత్తం 57 సీట్లకు పోలింగ్




విశ్వంభర, ఢిల్లీ : లోక్ సభ సార్వత్రిక ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం దేశ వ్యాప్తంగా చివరి దశ పోలింగ్ జరగబోతోంది. ఇందులో మొత్తం 7 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఉన్న 57 లోక్‌సభ సీట్లకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ పోలింగ్ కు సంబంధించిన పూర్తి ఏర్పాట్లను అధికారులు నిర్వహించారు. అయితే ఈ చివరి దశ పోలింగ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి నియోజక వర్గం కూడా ఉంది. యూపీలో వారణాసితో పాటు 13 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక బీహార్‌లో 8, పశ్చిమ బెంగాల్ 9, జార్ఖండ్ 3, పంజాబ్ 13, హిమాచల్ ప్రదేశ్ 4, ఒడిషా 6 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. దీంతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం అయిన చండీగఢ్‌కు కూడా ఈ విడతతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఇక దేశవ్యాప్తంగా 42 అసెంబ్లీ సీట్లకు కూడా ఇదే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ చివరి దశ పోలింగ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత మనీష్ తివారీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సహా పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు.

## డొనాల్డ్ ట్రంప్‌కు జైలు శిక్ష ఖాయమా?

**న్యూయార్క్ :** అమెరికాలో 2024 అధ్యక్ష ఎన్నికలకు ముందు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు బిగ్ షాక్ తగిలింది. పోర్న్‌స్టార్ కు అక్రమ చెల్లింపులు (హుష్ మనీ) చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్ ను దోషిగా తేల్చింది. మొత్తం 34 ఆరోపణలపై ట్రంప్ ను 14 సభ్యుల కోర్టు జ్యూరీ దోషిగా ప్రకటించింది. ఈ కేసులో ట్రంప్ కు జులై 11న కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. ట్రంప్ కు గరిష్ఠంగా నాలుగేళ్లు జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. గతంలో ఇదే తరహా నేరానికి పలువురు దోషులుగా తేలినప్పటికీ స్వల్ప శిక్షలు, జరిమానాలు మాత్రమే విధించారు. డొనాల్డ్ ట్రంప్ తనను 2006లో లైంగికంగా వాడుకున్నాడని, ఆ విషయం బయటకు రాకుండా ఉండేందుకు 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో పెద్ద మొత్తం సొమ్మును ట్రంప్ న్యాయవాది మైఖేల్ కోహెన్ నుంచి ముట్టచెప్పారని పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్ ఆరోపించారు. ఈ మేరకు న్యూయార్క్ కోర్టులో తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఆ మొత్తాన్ని ప్రచార కార్యక్రమాలకోసం అందిన విరాళాల నుంచి ఖర్చు చేశారని, అందుకోసం బిజినెస్ రికార్డులన్నింటిని తారుమారు చేశారన్నది ట్రంప్ పై ప్రధాన ఆరోపణ. ట్రంప్ తరపు న్యాయవాదులు మాత్రం ఈ విషయాన్ని తోసిపుచ్చారు. కేవలం డబ్బుల కోసమే మాజీ అధ్యక్షుడిపై ఆమె తప్పుడు ఆరోపణలు చేస్తోందని వాదించారు. మొత్తం 34 అంశాల్లో ట్రంప్ పై అభియోగాలు నమోదయ్యాయి. సుదీర్ఘ కాలంగా ఇరుపక్షాల వాదనలు కొనసాగుతూ వచ్చాయి. ఈ ఏడాది నవంబర్ లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరపున బరిలోకి దిగనున్న విషయం తెలిసిందే. ట్రంప్ ను నవంబర్ లో జరగబోయే దేశాధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా నామినేట్ చేసే రిపబ్లిక్ పార్టీ సమావేశాలు జులై 15 నుంచే ప్రారంభంకానున్నాయి. జులై 11న ట్రంప్ కు జైలు శిక్ష విధించినా ఎన్నికల ప్రచారానికి, అధ్యక్ష పదవిని చేపట్టడానికి ఎలాంటి అడ్డంకి కాదని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. ఎలాంటి శిక్ష పడినా ఈ కేసులో పైకోర్టుకు ట్రంప్ అప్పీల్ కు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. దోషిగా తేలిన తరువాత కోర్టు బయటకు వచ్చిన ట్రంప్ మీడియాతో మాట్లాడారు.. జ్యూరీ నిర్ణయం అవమానకరమని ట్రంప్ అభివర్ణించారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. చివరి వరకు నేను పోరాడుతూనే ఉంటానని అన్నారు.

# ఎగ్జిట్ పోల్స్ అంటే ఏంటి?

- ఎన్నికల ఫలితాలను ఎలా తేల్చుతారు?
- ఇంత ఉత్కంఠ ఎందుకు నెలకొందో తెలుసా?




**విశ్వంభర, ఢిల్లీ :** దేశంలో ఏడు దశల లోక్‌సభ ఎన్నికలు శనివారంతో ముగియనున్నాయి. ఏడు రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో శనివారం ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 57 పార్లమెంటు స్థానాలకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడతాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి ఎన్నికల అనంతరం ప్రకటిస్తారు. ఒపీనియన్ పోల్‌ను ఎగ్జిట్ పోల్స్ పోలి ఉంటాయి. ఓటువేసి పోలింగ్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఓటర్లను ఎవరికి ఓటు వేశారని సర్వే చేసేవారు అడుగుతారు. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద సేకరించిన వివరాలను బట్టి ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న విషయంపై ఏజెన్సీలు అంచనాలను ప్రకటిస్తాయి. అటు సార్వత్రిక సమరం.. ఇటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు.. హోరాహోరీ పోరుతో ఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయన్న విషయం ఉత్కంఠ రేపుతోంది. ఓటరు తీర్పుపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలేంటి? ఏ ఎగ్జిట్ పోల్స్ ఎవరికి పట్టం కడతాయి? సర్వే సంస్థలు జనం నాడిని పట్టుకుంటాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు శనివారం రానున్నాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి ఎగ్జిట్ పోల్స్ వస్తాయి. ఎగ్జిట్ పోల్స్‌పై దేశమంతటా ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. 543 లోక్‌సభ స్థానాల్లో గెలిచేది ఎవరు? టీమ్ NDA VS టీమ్ I.N.D.I.A ఎన్ని సీట్లు సాధిస్తాయి. మోదీ హ్యాట్రిక్ ఖాయమేనా? అన్న ప్రశ్నలకు ఆయా ఎగ్జిట్ పోల్ సంస్థలు అంచనాలను ప్రకటించనున్నాయి.

**ఏపీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ..**

ఎగ్జిట్ పోల్స్‌పై ఏపీ పార్టీల్లో హైటెన్షన్ నెలకొంది. పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా రానుందన్న ఆసక్తి నెలకొంది. టీడీపీ కూటమి గెలుచుకునే సీట్లు ఎన్ని? జగన్ లక్ష్యం నెరవేరుతుందా? పిఠాపురంలో పవన్ కల్యాణ్ పరిస్థితి ఏంటి? ఉత్తరాంధ్రలో ఎవరిది పైచేయి? రాయలసీమ సపోర్ట్ ఎవరికి? అన్న ప్రశ్నలకు కొన్ని గంటల్లోనే సమాధానం రానుంది.

# నేడే ఎగ్జిట్ పోల్స్..!

- ప్రధాన పార్టీల్లో ఉత్కంఠ
- ఎగ్జిట్ పోల్స్ అనుకూలంగా లేకుంటే పట్టించుకోవద్దంటున్న పార్టీలు..
- ఎవరి లెక్కలు వారివే..

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఏ పార్టీ గెలుస్తుంది.. ఎవరు సీఎం అవుతారు.. అనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ ఉంది. అయితే అది ఒక్కో పార్టీలో అంచనాలను ఒక్కో విధంగా మార్చేస్తోంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి ఎవరూ పెద్దగా స్పందించట్లేదు. కేవలం జగన మోహన్ రెడ్డి మాత్రమే ఐ ప్యాక్ టీమ్ తో మాట్లాడుతూ.. ఈ సారి 150కి పైగా సీట్లు సాధించి అధికారంలోకి వస్తున్నామని తెలిపారు. ఆయన తప్ప మిగతా పార్టీల వారు ఎవరూ మాట్లాడలేదు. చంద్రబాబు అయితే పోలింగ్ ముగియగానే విదేశాలకు వెళ్లిపోయారు. పవన్ కల్యాణ్ ఎక్కడకు వెళ్లాడో ఎవరికీ తెలియదు.

### పోలింగ్ ముగియగానే..

కానీ అన్ని పార్టీల్లో అధికారం మాదే అంటే మాదే అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇప్పుడు జూన్ 4న ఫలితాలు వచ్చే కంటే ముందే జూన్ 1న వచ్చే ఎగ్జిట్ పోల్స్ మీదనే అందరి చూపు ఉంది. జూన్ 1న పోలింగ్ ముగియగానే సాయంత్రం వచ్చే ఎగ్జిట్ పోల్స్ ఎవరి కలను నిజం చేస్తాయని అంతా ఎదురు చూస్తున్నారు. అయితే ఎగ్జిట్ పోల్స్ మీద ఒక్కో పార్టీ తీరు ఇప్పుడు ఒక్కో విధంగా ఉంది. అటు టీడీపీ కూటమిలో ఎగ్జిట్ పోల్స్ మీద పెద్దగా అంచనాలు లేనట్టే కనిపిస్తోంది. అందుకే ఆ పార్టీ తరఫున కొన్ని సోషల్ మీడియాలో ప్రకటనలు కూడా వస్తున్నాయి.

### వైసీపీలో అంచనాలు..

ఎగ్జిట్ పోల్స్ మనకు అనుకూలంగా లేకపోతే వాటిని పట్టించుకోవద్దంటూ ఇప్పటికే పార్టీ శ్రేణులకు సూచనలు కూడా వెళ్లాయంట. కాగా అటు వైసీపీలో మాత్రం ఓ రేంజ్ లో అంచనాలు పెరుగుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌లో ఈసారి వైసీపీకే అధికారం దక్కుతుందని అంటున్నాయి ఆ పార్టీ శ్రేణులు. రాబోయే ఫలితాలు కచ్చితంగా తమకే అధికారాన్ని కట్టబెట్టబోతున్నాయని అంటున్నారు. ఇప్పటికే వైసీపీలో ఎగ్జిట్ పోల్స్ సంస్థల నుంచి జగన్ కు సమాచారం వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. జగన్ అంత ధీమాగా ఉన్నాడని కూడా చెబుతున్నారు. అయతే ఈ ఎగ్జిట్ పోల్స్ ను నమ్మేందుకు ఈ సారి ఏపీ ఓటరు నాడీ భిన్నంగా ఉందని.. కాబట్టి ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాక్ట్ గా లేవని అంటున్నారు. ఈ సారి ఏపీలో ఓటరు ఎవరికి వేశారో సరిగ్గా చెప్పలేదంటున్నారు. ఎందుకంటే ఫలానా పార్టీకి వేశాం అంటే ఇంకో పార్టీ వాళ్లు అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తారని భయపడి.. గెలిచే పార్టీకి వేశామని కూడా చాలా మంది చెప్పారంట. ఇంకొందరేమో వేసింది ఒక పార్టీకి, ఇంకో పార్టీకి వేశామని చెప్పారంట. ఇలా స్పష్టమైన సమాధానాలు ఏపీ ఓటర్ల నుంచి వెళ్లలేదని అంటున్నారు.

కాబట్టి అలాంటి సమాధానాలతో వచ్చిన ఎగ్జిట్ పోల్స్ ను నమ్మేదెలా అని రాజకీయ నిపుణులు, పార్టీల నేతలు అడుగుతున్నారు. ప్రతిసారి ఎగ్జిట్ పోల్స్ స్పష్టమైన ఫలితాలను చెప్పలేవని.. కాబట్టి అసలు ఫలితాలు వచ్చేవరకు ఆగడం ఉత్తమం అంటున్నారు. మరి ఇన్ని గందరగోలాల మధ్య వస్తున్న ఎగ్జిట్ పోల్స్ ఏ మేరకు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయో చూడాలి.

# తొలి ఫలితం కొవ్వూరుదే..!

- ఆ రెండు నియోజకవర్గా ఫలితం కోసం రాత్రి వరకు ఆగాల్సిందే
- 111 నియోజకవర్గాల ఫలితాలు మధ్యాహ్నం లోపే
- మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- ఆ తర్వాతనే ఈవీఎంల లెక్కింపు



**విశ్వంభర, విజయవాడ :** ఏపీ ఎన్నికల ఫలితాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్నడూ జరగనంత టఫ్ ఫైట్ ఈ సారి జరగడమే ఇందుకు కారణం. ఎవరు గెలస్తారనే దానిపై ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదు. పోటా పోటీ వాతవరణం ఉంది కాబట్టి కౌంటింగ్ రోజు కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఏపీలో 175 నియోజకవర్గాలు ఉంటే.. ఇందులో మొదటి ఫలితం వచ్చేది మాత్రం కొవ్వూరు నియోజకవర్గానిదే. కొవ్వూరుతో పాటు నరసాపురం ఫలితం కూడా దాదాపు ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 13 రౌండ్లు మాత్రమే ఉన్నాయి. కాబట్టి అన్నిటికన్నా ముందు ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు వెలువడనున్నాయి.

### వాటి కోసం రాత్రి దాకా..

ఒక్కో రౌండు పూర్తవడానికి గరిష్ఠంగా 20 నిమిషాల నుంచి 30 నిమిషాల లోపు మాత్రమే పట్టే అవకాశం ఉంది. కాబట్టి..ఈ రెండు ఫలితాలు త్వరగా వచ్చే అవకాశం ఉంది. రంపచోడవరం, చంద్రగిరి నియోజకవర్గాల్లో మొత్తం 29 రౌండ్లలో ఓట్లు లెక్కించాల్సి ఉంటుంది. అన్నింటికన్నా చివర ఈ రెండు ఫలితాలు వెలువడే అవకాశం ఉంటుంది. ఇక భీమిలి, పాణ్యం నియోజకవర్గాల ఫలితా కోసం కూడా రాత్రి వరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా 25 రౌండ్ల చొప్పున ఓట్లు లెక్కించాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఉదయం 4 గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 5 గంటలకు వారికి ఏయే టేబుళ్లు కేటాయించారన్న సమాచారం అందిస్తారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుండగా.... తొలుత ఆర్మీ సర్వీస్ ఉద్యోగుల ఓట్లు ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి అరగంట సమయం పట్టనుంది. ఆ తర్వాత ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ను తెరిచి ఓట్లు లెక్కించనున్నారు.

### 111 నియోజకవర్గాల ఫలితం మధ్యాహ్నం లోపే..

రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో అత్యధికంగా 111 నియోజకవర్గాల్లో 20కంటే తక్కువ రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటల్లోగా పూర్తిచేయనున్నారు. మరో 60 నియోజకవర్గాల్లో 21 నుంచి 25 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఫలితాలు సాయంత్రానికి అందుబాటులోకి రానున్నాయి. మరో 4 నియోజకవర్గాలు మాత్రమే రాత్రి వరకు లెక్కింపు సాగనుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 9 గంటల కల్లా మొత్తం ప్రక్రియ ముగించేలా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఉదయం 11 గంటల కల్లా ఫలితాల ట్రెండ్ వెలువడే అవకాశం ఉంది.

# పల్నాడు జిల్లాలో నాలుగు రోజులు షాపులు బంద్..!

- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధింపు
- అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే జైలుకే
- జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ వార్నింగ్

**విశ్వంభర, పల్నాడు :** ఏపీలో పోలింగ్ రోజున పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను ఇంకా ఎవరూ మర్చిపోలేదు. ఈ జిల్లాలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల నడుమ దారుణంగా గొడవలు జరిగాయి. అధిక సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. కాబట్టి ఆ హింసాత్మక ఘటనలను దృష్టిలో పెట్టుకుని జూన్ 4 కౌంటింగ్ సందర్భంగా పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ మరోసారి గొడవలు జరగకుండా చూసేందుకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా పటిష్ట చర్యలు చేపడుతున్నారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తున్నారు. అయినా సరే గొడవలు జరిగే అవకాశం ఉందని ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు జిల్లాలో 144 సెక్షన్ విధిస్తున్నారు.

### కఠిన చర్యలు తప్పవు..

పల్నాడు ప్రాంతానికి మంచిపేరు ఉందని.. దాన్ని చెడగొద్దంటూ ఎస్పీ మల్లికా గార్గ్ అన్నారు. ఎన్నికల క్రమంలో జరిగిన గొడవలతో ఏపీలోనే కాదు దేశంలోనే చెత్త జిల్లాగా పల్నాడు పేరొందిందని అన్నారు. మాచర్ల, నరసరావుపేటలో జరిగిన గొడవలు దేశమంతటా మార్మోగాయని పేర్కొన్నారు. పోలీసులంటే ఎవరికీ భయం లేదని.. మరోసారి జిల్లాలో అల్లర్లు జరిగితే పోలీసులంటే ఏంటో చూపిస్తామని పేర్కొన్నారు.

### గురజాల ప్రజలు జాగ్రత్త..

ఈ క్రమంలో గురజాల పట్టణ, రూరల్ ప్రాంత ప్రజలకు పోలీసులు ముఖ్య విజ్ఞప్తి చేశారు. జూన్ 1న (శనివారం) సాయంత్రం నుంచి ఇక్కడ 144 సెక్షన్ పూర్తిస్థాయిలో అమల్లో ఉంటుందని.. ఏ ఒక్క షాపు కూడా ఓపెన్ చెయ్యరని తెలిపారు. జూన్ 5 వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని.. కావున ప్రజలు ఇబ్బంది లేకుండా వారికి కావాల్సిన సరుకులు, ఇతర సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. అలాగే, స్థానికంగా షాపులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని.. అలా ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని గమనించి పోలీస్ వారికి సహకరించాలని సూచించారు. పోలింగ్ అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

### నాలుగు రోజులు..

పల్నాడులో జూన్ 2 నుంచి 5వ తేదీ వరకూ వరుసగా 4 రోజులు షాపులు బంద్ చేయాలని వ్యాపార వర్గాలకు ఎస్పీ సూచించారు. పల్నాడులో గడిచిన 18 రోజులుగా 144 సెక్షన్ కొనసాగుతోందని అన్నారు. 10 రోజుల వ్యవధిలోనే 160 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఘర్షణల కేసుల్లో 1300 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.



## మాణిక్ ప్రభుకు మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**విశ్వంభర, నారాయణఖేడ్ మే 31 :** మాణిక్ ప్రభు జాతర సందర్భంగా శుక్రవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాణిక్య ప్రభు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆయన తోపాటు మండల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్, ఎంపీటీసీ దత్తు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు యాదుల్, నాయకులు మాణిక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అమర్ సెట్, యాదగిరి, సాయిలు తదితరులు ఉన్నారు.

# ఏపీ అప్పులు ఎన్నో చెప్పాలి..

- గవర్నర్‌ను కలిసిన పురంధేశ్వరి
- ఆర్థిక స్థితిగతులపై వివరాలు చెప్పించాలంటూ ఫిర్యాదు
- గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతి పత్రం అందజేత



**విశ్వంభర, విజయివాడ:** ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిశారు. శుక్రవారం నాడు బీజేపీ నేతలతో కలిసి పురందేశ్వరి విజయవాడలోని రాజ్ భవన్ కు వెళ్లారు. ఏపీ ఆర్థిక స్థితిగతులపైన వివరాలు బహిరంగ పర్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్ ను పురందేశ్వరి కోరారు. ఈ మేరకు వినతి పత్రం కూడా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పురంధేశ్వరి లేఖలో ఇంకొన్ని అంశాలను కూడా ప్రస్తావించారు. "మొత్తం అవుట్ స్టాండింగ్ ఆర్బీఐ లిస్టు ప్రకారం తెచ్చిన అప్పులు. కార్పొరేషన్ల ద్వారా వాటి కోసం తెచ్చిన అప్పుల మొత్తం వివరాలు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం ఎంత? రాష్ట్ర ప్రభుత్వం ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన అప్పులు మొత్తం ఎంత? రాష్ట్ర ప్రభుత్వం సావనీర్ గ్యారెంటీ ఇచ్చి తెచ్చిన అప్పులు ఎన్ని? ఎన్నికల అనంతరం కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లుల వివరాలు బహిరంగ పర్చాలంటూ పురంధేశ్వరి డిమాండ్ చేశారు.


# సజ్జలపై క్రిమినల్ కేసు

- టీడీపీ నేతల ఫిర్యాదు
- కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు

**విశ్వంభర, గుంటూరు :** ఏపీ రాజకీయాల్లో ప్రతీకార చర్యలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. వైసీపీ వాళ్లు టీడీపీ మీద.. ప్రతిపక్షాలు అధికార పార్టీ నేతల మీద వరుసగా కేసులు పెడుతున్నారు. ఇప్పటికే పోలింగ్ ముగిసి అంతా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఏపీలో మరో పోరు నడుస్తోంది. ఇంకా ఫలితాలు రాక ముందే చర్యలకు అన్ని పార్టీలు కత్తులు నూరుతున్నాయి. తాజాగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీద కూడా కేసు నమోదైంది. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసు పెట్టారు. కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో వైసీపీ రెండు రోజుల క్రితం ఓ మీటింగ్ పెట్టింది. ఇందులో మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రూల్స్ పాటించే వాళ్లను కౌటింగ్ ఏజెంట్లుగా కూర్చొబెట్టొద్దని గట్టిగా నిలదీసేవాళ్లను ఉంచాలని కేడర్‌కు సూచించారు. ఇదే ఇప్పుడు కేసుకు కారణమైంది. రూల్స్ పాటించే కౌటింగ్ ఏజెంట్లు అవసరం లేదన్న సజ్జల వ్యాఖ్యలు కేడర్‌ను రెచ్చగొట్టేలా ఉన్నాయని టీడీపీ నేతలు ఫైర్ అయ్యారు. టీడీపీ సీనియర్ నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న తీసుకున్న తాడేపల్లి పోలీసులు 153, 505, 125 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు పెట్టారు.

# రెండు రోజుల్లో ఏపీకి నైరుతి రుతుపవనాలు..!

- కోస్తా, రాయలసీమలో విస్తారంగా వర్షాలు
- నేడు, రేపు తగ్గనున్న ఉష్ణోగ్రతలు



**విశ్వంభర, విశాఖపట్నం :** వేసవి తాపానికి అల్లాడిపోతున్న ఏపీ ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త తెలిపింది. మరో రెండు రోజుల్లో ఏపీకి నైరుతి రుతుపవనాలు రానున్నట్టు స్పష్టం చేసింది. శనివారం, ఆదివారం రెండు రోజులు కాస్త ఉష్ణోగ్రతలు మామూలుగానే నమోదవుతాయని.. సోమవారం నాటికి నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు అధికారులు. రెండు మూడు రోజుల్లో అంటే జూన్ 2 లేదా 3 తేదీల్లో రాయలసీమలోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది. ఆ తరువాత తెలంగాణ, కోస్తా ప్రాంతాలకు విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు జూన్ 2, 3 తేదీలనాటికి రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మరో రెండు రోజుల పాటు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేరకు అధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్, యానాం సమీపంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు తెలిపారు. రుతు పవనాల కారణంగా కోస్తా, రాయలసీమలో శుక్రవారం, శనివారం ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.



ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు

# అందుబాటులో ఉంచాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్





## బ్రహ్మోత్సవాలు సమాప్తయామీ

ముగిసిన వెంకటేశ్వరుడి సప్తమ వార్షిక వేడుకలు

**విశ్వంభర, రాజేంద్రనగర్ :** వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిస్థితిలోని మైలార్దేవుపల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ లోని వెంకన్న గుట్టపై వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఇటీవల ప్రారంభమైన విషయం తెలిసింది. చివరి రోజైన శుక్రవారం ఉదయం నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నిర్వహించిన పల్లకి సేవలో స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు. చక్రస్నాన మహా ఘట్టంతో వేడుకలు ముగిసినట్లు కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



## ఏపీ ఎడ్ సెట్.. హాల్ టికెట్లు అందుబాటులోకి..!

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలోని బీఈడీ (స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఎడ్‌సెట్-2024 ఎగ్జామ్ హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబరు, క్వాలిఫైయింగ్ ఎగ్జామ్ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. జూన్ 8న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఎడ్‌సెట్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 15న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఆన్సర్ కీపై ఏమైనా సందేహాలుంటే జూన్ 18న సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చు. ఆ తర్వాత ఫైనల్ కీతోపాటు ఎడ్‌సెట్ ఫలితాలను విడుదల చేస్తారు. ఈ ఏడాది ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష బాధ్యత నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే.

## జూన్ 18 నుంచి డిగ్రీ ఆన్ లైన్ కౌన్సెలింగ్..!

- 29 వరకు కొనసాగించనున్న అధికారులు
- కాలేజీలు, యూనివర్సిటీలకు ఆదేశాలు

**విశ్వంభర, విజయవాడ:** ఏపీలోని డిగ్రీ 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్ లైన్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ప్రకటించింది ఉన్నత విద్యామండలి. జూన్ 18 నుంచి 29 వరకు నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రాథమికంగా నిర్ణయించింది. డిగ్రీ ప్రవేశాల్లో బీసీఏ, బీబీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి ఉంటేనే కౌన్సెలింగ్‌లో వీటిని పెట్టనున్నట్లు పేర్కొంది. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ చేపట్టాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కాలేజీలు, అనుబంధ గుర్తింపు వంటి అనుమతులు పొడిగింపు ఫీజును జూన్ 18 లోగా చెల్లించాలని రాష్ట్రంలోని కాలేజీలకు యూనివర్సిటీలు ఆదేశాలు జారీ చేశాయి.

## టీ20 ప్రపంచకప్‌లో ఏకైక సెంచరీ చేసిన ఒకే ఒక్కడు



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 ప్రపంచకప్ 9వ ఎడిషన్ జూన్ 1 నుంచి ఆతిథ్య అమెరికా, కెనడా మధ్య మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇదే అతిపెద్ద టోర్నీ అవుతుంది. ఈసారి నాలుగు గ్రూపులుగా విభజించి మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. ఇప్పటివరకు 8 టీ20 ప్రపంచకప్‌లు ముగిశాయి. ఈ ఎనిమిది ఎడిషన్లలో ఎన్నో రికార్డులు నమోదయ్యాయి. అయితే ఈ పొట్టి ఫార్మాట్ ప్రపంచకప్‌లో కేవలం 11 సెంచరీలు మాత్రమే లిస్టులోకి వచ్చాయి. ఇక ఈ జాబితాలో ఒకే ఒక్క టీమిండియా బ్యాటర్ ఉన్నాడు. ఆ భారత ఆటగాడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కాదు.. అతడే మిస్టర్ ఐపీఎల్ సురేష్‌రైనా. 2010, మే 2న దక్షిణాఫ్రికాపై సురేష్‌రైనా సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 60 బంతులు ఎదుర్కొన్నరైనా 168.33 స్ట్రైక్ రేట్‌తో 101 పరుగులు చేశాడు. ఇందులో 9 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు 5 టీ20 ప్రపంచకప్‌లు జరిగాయి, కానీ ఏ భారత బ్యాట్స్‌మెన్ కూడా సెంచరీ చేయలేక పోయారు. టీ20 ప్రపంచకప్‌లో నమోదైన 11 సెంచరీల గురించి ప్రస్తావిస్తే.. 2 సెంచరీలతో క్రిస్ గేల్ అగ్రస్థానంలో నిలిచాడు. 2007లో దక్షిణాఫ్రికాపై, 2016లో ఇంగ్లాండ్‌పై గేల్ సెంచరీల మోత మోగించాడు. అతడితో పాటు సురేష్ రైనా, మహేల జయవర్ధనే, బ్రెండన్ మెకల్లమ్, అలెక్స్ హేల్స్, అహ్మద్ షెహజాద్, తమీమ్ ఇక్బాల్, జోస్ బట్లర్, రిలే రూసో, గ్లెన్ ఫిలిప్స్ తలో సెంచరీ చేశారు.

## ఆ ఇండియన్ ప్లేయర్ క్రిస్ గేల్‌లా కనిపించాడు: మాంటీ పనేసర్



**విశ్వంభర, స్పోర్ట్స్** : ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ యువ క్రికెటర్ శివమ్ దూబేపై ప్రసంశలు కురిపించారు. అతని బాల్ హిట్టింగ్ సామర్థ్యాన్ని బట్టి శివమ్ దూబే 'ఇండియన్ క్రిస్ గేల్' అని ప్రశంసల వర్షం కురిపించారు.టీ20 ప్రపంచ కప్ 2024కు అతన్ని ఎంపిక చేయడం ద్వారా ఇండియా సెలెక్టర్లు సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు.ఐపీఎల్ 2024లో శివమ్ దూబే ఆట చూసి ఆశ్చర్య పోయానని పనేసర్ అన్నారు. కాలు కదపకుండా అతను బంతిని కొట్టే తీరు, అతని శక్తిని చూశాక క్రిస్ గేల్‌లా కనిపించాడని పేర్కొన్నారు. "రింకూ సింగ్ మంచి ఫామ్‌లో లేకపోవడంతో అతని స్థానంలో మరొకరికి సెలెక్టరు అవకాశం ఇవ్వడం సరైనదని మాంటి పనేసర్ అన్నారు.అతని కంటే మెరుగైన ప్రదర్శన చేస్తున్న ఇతర ఆటగాళ్లు ఇండియాలో చాలా క్రికెటర్లు ఉన్నప్పటికీ కూడా ముఖ్యంగా శివమ్ దూబే ఫామ్ అద్భుతం అని కొనియాడారు. అతను బంతిని కొట్టే విధానం నమ్మశక్యం కానిది. బహుశా అతనే ఇండియన్ క్రిస్ గేల్ అని చెప్పొచ్చు.." పనేసర్ ప్రశంసల వర్షం కురిపించారు.

# వరల్డ్ కప్‌లో మెరిసేది ఎవరో?

**విశ్వంభర, స్పోర్ట్స్** : 2024 టీ20 వరల్డ్ కప్ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటివరకు జరిగిన 8 ఎడిషన్లలో అనేక మంది ఆటగాళ్లు ప్రపంచానికి పరిచయం అయ్యారు. ముఖ్యంగా ప్రతి ఎడిషన్‌లో ఆయా జట్లనుంచి పలువురు యంగ్ ప్లేయర్లు వెలుగులోకి వస్తుంటారు. ఇప్పటి స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, బాబర్ అజామ్, కర్లోస్ బ్రాత్‌వైట్ తదితరులు అలా పొట్టికప్ టోర్నీలో రాణించి స్టార్లుగా ఎదిగినవారే. ఈ నేపథ్యంలో ఈసారి కూడా పలువురు ఆటగాళ్లపై స్పెషల్ ఫోకస్ ఉండనుంది. మరి వారెవరో తెలుసా?




**యశస్వీ జైస్వాల్:**
21ఎళ్ల టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ కెరీర్‌లో తొలి టీ20 ప్రపంచకప్ ఆడనున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేసే అవకాశం దాదాపు జైస్వాల్‌కే దక్కుతుంది. గతేడాది ఐపీఎల్‌లో రాణించిన జైస్వాల్‌కు టీమ్‌ఇండియా తరపున అరంగేట్రం చేసే ఛాన్స్ వచ్చింది. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో 16 ఇన్నింగ్స్‌లో 502 పరుగులు చేశాడు. కాగా, 2024 ఐపీఎల్‌లోనూ 435 పరుగులతో అదరగొట్టిన జైస్వాల్, ప్రపంచకప్‌లో రాణిస్తే భారత్‌కు మంచి ఆరంభాలు దక్కుతాయి.

**ట్రిస్టన్ స్టబ్స్:**
సౌతాఫ్రికా యంగ్ ప్లేయర్ స్టబ్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా ఇంపాక్ట్ చూపలేదు. అయతే రీసెంట్‌గా ముగిసిన ఐపీఎల్‌లో మాత్రం స్టబ్స్ ది ల్లీ క్యాపిట ల్స్‌కు మిడిలార్డర్‌లో బలంగా నిలిచాడు. 13 ఇన్నింగ్స్‌లో 378 పరుగులతో సత్తా చాటాడు. దీంతో సౌతాఫ్రికా ఈ కుర్రాడిని పొట్టికప్పు జట్టుకు ఎంపికచేసింది. ఇక ఐపీఎల్ ఫామ్ కొనసాగిస్తే, సఫారీలకు ఛేజింగ్‌లో కీలక ప్లేయర్‌గా మారే అవకాశం ఉంది.

**కామెరూన్ గ్రీన్:**
ఆస్ట్రేలియా కుర్రాడు గ్రీన్ ఇప్పటివరకు అంతర్జాతీయ టీ20లో పెద్దగా రాణించలేదు. కానీ, 2024 ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున ఆడిన గ్రీన్ 255 పరుగు లుతో ఫర్వాలేదనిపించాడు. దూకుడైన బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్ చేయగల నైపుణ్యాలు ఉండడం గ్రీన్‌కు కలిసొచ్చే అంశం. ఈ కార ణంగానే గ్రీన్ ఆసీస్ జట్టుకు సెలెక్ట్ అయ్యాడు. ఒకవేళ తుదిజట్టులో స్థానం దక్కితే పవర్ ప్లేలో గ్రీన్ ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంది. అటు బౌలింగ్‌లోనూ రాణించగలడు.

**విల్ జాక్స్:**
25ఏళ్ల ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే విధ్వంసం సృష్టించగలడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో గుజరాత్‌తో మ్యాచ్‌లో సాధించిన సెంచరీయే అందుకు ఉదాహరణ. ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహించిన జాక్స్ ఈ మ్యాచ్‌లో 50 నుంచి 100 పరుగుల మార్క్ అందుకోవడానికి కేవలం 10 బంతులు తీసుకున్నాడు. దీంతో ఒక్కసారిగా జాక్స్ వెలుగులోకి వచ్చాడు. ఈ పొట్టికప్‌లోనూ ఇంగ్లాండ్ ఈ యంగ్ ఆల్‌రౌండర్‌పై ఆశలు పెట్టుకుంది.

## వరల్డ్ కప్ - తొలి మ్యాచ్‌కు భారీ అడ్డంకి!



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 ప్రపంచకప్ 2024 టోర్నీకి రంగం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో అగ్రరాజ్యం అమెరికా వేదికగా ఈ మెగా టోర్నీ తెరలేవనుంది. జూన్ 2న(ఆదివారం) జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య అమెరికా, కెనడా పోటిపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు మ్యాచ్ మొదలు కానుంది. టెక్సాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం ఈ పోరుకు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందని తెలిసింది. ఇప్పటికే ఈ మైదానం వేదికగా జరగాల్సిన వార్మప్ మ్యాచుల్లో మూడు వర్షార్పణం అయ్యాయి. ఈ స్టేడియంలో నేపాల్ కెనడా మధ్య జరిగిన తొలి వార్మప్ మ్యాచులో కెనడా 63 పరుగుల తేడాతో విజయం సాధించింది. కానీ ఆ తర్వాత జరగాల్సిన బంగ్లాదేశ్ అమెరికా, అమెరికా నేపాల్, నెదర్లాండ్స్ కెనడా వార్మప్ మ్యాచ్‌లు బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి.ఈ క్రమంలోనే ఇప్పుడు జూన్ 2న జరగాల్సిన టీ20 వరల్డ్ కప్ 2024 తొలి మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.ఈ పోరు కూడా వర్షం కారణంగా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం టెక్సాస్‌లో ప్రతీ రోజు వర్షం పడుతోంది. దీంతో తొలి మ్యాచ్ జరిగే జూన్2న కూడా వర్షం పడే ఛాన్స్ ఉందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. ఆ రోజు టెక్సాస్‌లో 21 నుంచి 24 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందట. ఆ రోజంతా ఆకాశానికి మబ్బులు కమ్ముకోనున్నాయని అంటున్నారు.కాబట్టి స్వల్ప స్థాయిలో వర్షం పడినా కూడా మ్యాచ్ రద్దు అయ్యే ఛాన్స్‌లు ఉన్నాయి. ఎందుకంటే ప్రతీ రోజు వర్షం పడుతుండటం వల్ల ఇప్పటికే స్టేడియం చిత్తడిగా మారింది. దీంతో ఆ రోజు స్వల్ప స్థాయిలో వర్షం పడినా ఆటకు మైదానాన్ని సిద్ధం చేయలేని పరిస్థితి ఏర్పడింది. కాగా, భారత్ తన తొలి మ్యాచ్‌ను జూన్ 5న ఐర్లాండ్‌తో ఆడనుంది.

# తుఫాన్ ఇన్నింగ్స్‌తో వార్నింగ్ ఇచ్చిన ఐపీఎల్ స్టార్..

**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 ప్రపంచ కప్ 2024 IPL ముగిసిన వెంటనే ప్రారంభమవుతుంది. చాలా మంది ఆటగాళ్ళు IPLలో వారి బలమైన ఫామ్‌తో ఈ టోర్నమెంట్‌లోకి ప్రవేశించబోతున్నారు. విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, ట్రావిస్ హెడ్, జోస్ బట్లర్ వంటి ఆటగాళ్లపై ఎక్కువ మంది దృష్టి ఉంది. అయితే, మొదట వెస్టిండీస్‌లోని దిగ్గజాలు తమ సత్తా చాటారు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అద్భుత ప్రదర్శన చేసిన నికోలస్ పురాన్.. టోర్నీకి ముందు జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో తన సత్తా చాటుతూ భారీ ఫోర్లు, సిక్సర్లతో ఆస్ట్రేలియా బౌలర్లను చిత్తు చేశాడు. పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఇరు జట్లూ చెలరేగిపోయాయి. వెస్టిండీస్ తన పూర్తి బలంతో మ్యాచ్‌లోకి ప్రవేశించింది. అయితే, ఆస్ట్రేలియన్ జట్టు ఇప్పటికీ కొంతమంది IPL స్టార్లు లేకుండానే మ్యాచ్‌లోకి ప్రవేశించింది. పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, ట్రావిస్ హెడ్, గ్లెన్ మాక్స్‌వెల్ వంటి ప్రముఖులు కూడా ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నారు. అయినప్పటికీ, మ్యాచ్ సరదాగా సాగింది. ఇరు జట్ల బ్యాట్స్‌మెన్స్ పరుగుల వరద పారింది.



**రెచ్చిపోయిన పూరన్..**
వెస్టిండీస్ జట్టు తరపున ప్రతి బ్యాట్స్‌మెన్ వచ్చిన వెంటనే బ్యాట్‌ను స్వింగ్ చేయడం ప్రారంభించాడు. బౌండరీలు సాధించడంపై మాత్రమే దృష్టి పెట్టాడు. కానీ, సిక్సర్‌తో తన ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన నికోలస్ పూరన్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. పూరన్ తన తొలి 4 బంతుల్లో వరుసగా 3 సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టాడు. పూరన్ కేవలం 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీని తర్వాత కూడా, అతని దాడి కొనసాగింది. చివరకు అతను 300 స్ట్రైక్ రేట్ వద్ద కేవలం 25 బంతుల్లో 75 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. పూరన్ తన ఇన్నింగ్స్‌లో 8 సిక్స్‌లు, 5 ఫోర్లు కొట్టాడు.పూరన్ మాత్రమే కాదు, ఐపీఎల్‌లో కొన్ని చిన్నదైన, కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ కూడా 25 బంతుల్లో 52 పరుగులు చేశాడు. అయితే, KKR కోసం ఏ మ్యాచ్ ఆడని షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ కేవలం 18 బంతుల్లో 4 సిక్సర్లు, 4 ఫోర్లతో 47 పరుగులు చేశాడు. దీంతో వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 257 పరుగుల భారీ స్కోరు చేసింది.

**ఆస్ట్రేలియా కూడా తగ్గేదేలే..**
వెస్టిండీస్ మాదిరిగానే ఆస్ట్రేలియా కూడా శుభారంభం చేసింది. స్పిన్నర్ అష్టన్ అగర్ నుంచి ఓపెనింగ్ వికెట్ తీసి జట్టు అందరినీ ఆశ్చర్యపరిచింది. అగర్ 13 బంతుల్లో 28 పరుగులు చేసి ఈ నిర్ణయం సరైనదని నిరూపించాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ 4 పరుగులు మాత్రమే చేసి ఔట్ కావడంతో దాని ప్రభావం ఆస్ట్రేలియాపై కనిపించింది. జోష్ ఇంగ్లిష్, నాథన్ ఎల్లిస్‌తో సహా మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా ఇన్నింగ్స్ ఆడారు. అయితే, మొత్తం జట్టు 222 పరుగులకే చేరుకుని 35 పరుగుల తేడాతో ఓడిపోయింది.

## జియో నుంచి అదిరిపోయే ప్లాన్..

**విశ్వంభర, బిజినెస్:** రిలయన్స్ జియో.. అనతి కాలంలోనే కోట్లాది మంది వినియోగదారులను సంపాదించుకుంది. ఇతర నెట్‌వర్క్ కంపెనీలకు పోటీగా జియో దూసుకుపోతోంది. వినియోగదారుల కోసం కొత్త కొత్త రీఛార్జ్ ప్లాన్స్‌ను ప్రవేశపెడుతూ మరింత మందిని ఆకర్షిస్తోంది. భారతీయ టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో అతిపెద్ద వినియోగదారులను కలిగి ఉంది. కంపెనీ ఇప్పటికే ఉన్న వినియోగదారులకు అనేక ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తోంది, వాటిలో కొన్ని కొత్త వినియోగదారులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాయి. కంపెనీ కేవలం రూ. 26 ప్లాన్‌ను అందిస్తోంది, పూర్తి 28 రోజుల పాటు డేటా ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయి. రిలయన్స్ జియో రూ. 26 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ నిజానికి జియోఫోన్ యాడ్‌ఆన్ రీఛార్జ్ ప్లాన్. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే పరిమిత సమయం వరకు డేటా ప్రయోజనం అందించబడుతుంది. ప్లాన్‌లో అందుబాటులో ఉన్న ప్రయోజనాల గురించి మాట్లాడితే.. ఇది డేటాను మాత్రమే అందిస్తుంది. కాల్ లేదా ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలను కలిగి ఉండదు. 26 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే, వినియోగదారులకు మొత్తం 2GB డేటా అందుకుంటారు. ఈ డేటా 28 రోజుల వ్యాలిడిటీతో లభిస్తుంది. తక్కువ డేటాను ఉపయోగించే లేదా

- రూ.26 రీఛార్జ్‌తో 28 రోజుల వ్యాలిడిటీ
- జియోఫోన్ లేకపోయినా రీఛార్జ్!



జియోఫోన్‌ని ఉపయోగించే సబ్‌స్క్రైబర్‌లకు ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది.ఈ ప్లాన్‌ను ఇప్పటికే ఉన్న ఏదైనా జియోఫోన్ రీఛార్జ్ ప్లాన్‌తో టాప్‌అప్‌గా ఉపయోగించవచ్చు. జియో ఇతర ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ల కంటే ఈ ప్లాన్ చాలా చౌకగా ఉంటుంది. మీరు తక్కువ డేటాను ఉపయోగిస్తుంటే, 28 రోజుల వ్యాలిడిటీతో ప్లాన్ కావాలనుకుంటే ఈ ప్లాన్ మీకు మంచి ఎంపికగా ఉంటుంది.మీకు జియోఫోన్ లేకపోయినా, అటువంటి ప్రయోజనాలతో కూడిన ప్లాన్‌తో రీఛార్జ్ చేయాలనుకుంటే, మీరు రూ.155 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ప్లాన్ జియోఫోన్‌ని ఉపయోగించని వినియోగదారులకు పైన పేర్కొన్న ప్రయోజనాలను అందిస్తుంది. ఈ డేటా మాత్రమే ప్లాన్ 28 రోజుల చెల్లుబాటుతో 2జీబీ మొత్తం డేటాను కూడా అందిస్తోంది.

## అంచనాకు మించి జీడీపీ వృద్ధి రేటు

**విశ్వంభర, బిజినెస్ :** భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాలు మించి మెరుగైన ఫలితాలు సాధించింది. జనవరి - మార్చి నాలుగవ త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదైంది. ఈ మేరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ డేటాను విడుదల చేసింది. దీంతో 2023-24 వార్షిక ఏడాది జీడీపీ వృద్ధి రేటు అంచనాకు నుంచి 8.2 శాతానికి పెరిగింది.భారత జీడీపీ జనవరి నుంచి మార్చి త్రైమాసికంలో బలమైన వృద్ధి రేటు సాధిస్తుందని నిపుణులు అంచనా వేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా .. జనవరిమార్చి జీడీపీ వృద్ధి రేటును 7 శాతంగా అంచనా వేసింది. మరోవైపు 'ఈటీ పోల్' 6.8 శాతం, రాయిటర్స్ పోల్ 6.7 శాతానికి అంచనా వేశాయి. ఇక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా .. జనవరి - మార్చి 4వ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతం, 2023-24 ఏడాది మొత్తం 8 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా వేసింది. కానీ వీటి అంచనాలకు మించి నాలుగో త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి రేటు సాధించడం విశేషం. గత ఆర్థిక ఏడాది 2022-23 వార్షిక ఏడాది 7 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదైన సంగతి తెలిసిందే.

## భారత్‌కు లక్ష కిలోల బంగారం

**విశ్వంభర, బిజినెస్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల బంగారంపై భారీ కొనుగోళ్లు చేసింది. అలాగే, సెంట్రల్ బ్యాంక్ బ్రిటన్‌లో కొనుగోలు చేసిన 100 టన్నులకు పైగా బంగారాన్ని భారత్‌లోకి తరలించింది. వంద టన్నుల బంగారాన్ని దేశీయ ఖజానాలో చేర్చింది. అయితే 33 ఏళ్ల తర్వాత సెంట్రల్ బ్యాంక్ తన నిల్వల్లో ఇంత భారీగా బంగారాన్ని డిపాజిట్ చేయడం ఇదే తొలిసారి. అంటే భారత్ కొనుగోలు చేసిన బంగారం ఇకపై ఇంగ్లండ్ ఖజానాలో నిలిచిపోనుంది. బదులుగా, ఇప్పుడు అది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యాలెట్లలో ఉంచనుంది. డేటా ప్రకారం.. మార్చి చివరి నాటికి రిజర్వ్ బ్యాంక్ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. ఇందులో 413.8 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ విదేశాల్లో ఉంచింది. అదే సమయంలో గత ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ తన నిల్వలకు 27.5 టన్నుల బంగారాన్ని జోడించింది. ఇలాంటి పరిస్థితుల్లో విదేశాల నుంచి ఆర్‌బీఐ ఇంత మొత్తంలో బంగారాన్ని ఎందుకు కొనుగోలు చేస్తుందన్న ప్రశ్న తలెత్తుతోంది.

- 33 ఏళ్లలో ఇదే తొలిసారి
- ప్రకటించిన భారతీయ రిజర్వ్ బ్యాంక్



**భారతదేశం విదేశాల నుంచి బంగారాన్ని ఎందుకు కొనుగోలు చేస్తోంది?**
విదేశాల్లో నిల్వ ఉన్న బంగారాన్ని ఆర్‌బీఐ క్రమంగా తగ్గించి భారత్‌కు తీసుకువస్తోంది. భారతదేశం తన బంగారాన్ని తిరిగి తీసుకువస్తోంది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి భారతదేశానికి మరింత బంగారం అవసరం. దేశంలో బంగారం నిల్వలు పెరగాలని, బంగారాన్ని తమ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని భారత్ కోరుకుంటోంది. మార్చి చివరి నాటికి ఆర్‌బీఐ వద్ద మొత్తం 822.11 టన్నుల బంగారం నిల్వ ఉంది. ఇందులో 413.8 టన్నుల బంగారం విదేశాల్లోనే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలోనే ఆర్‌బీఐ దాదాపు 27.5 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఇటీవలి కాలంలో, ఆర్‌బిఐ వేగంగా బంగారం కొనడానికి ఆసక్తి చూపుతోంది. 2023 సంవత్సరంతో పోల్చితే, జనవరిమార్చిలో మాత్రమే ఆర్బీఐ బంగారాన్ని ఒకటిన్నర రెట్లు కొనుగోలు చేసింది. క్లిష్ట, సవాలుతో కూడిన పరిస్థితికి ఇది ఒక వ్యూహాత్మక అడుగుగా పరిగణిస్తోంది. ప్రపంచంలోని చాలా దేశాలు తమ బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లోని సేఫ్‌లలో ఉంచుతాయి. ఇందుకోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బ్రిటన్‌కు ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. స్వాతంత్ర్యానికి ముందు రోజుల నుండి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కొంత భారతీయ బంగారు నిల్వలను కలిగి ఉంది. ఎకనామిక్ టైమ్స్ నివేదికలో, ఆర్‌బిఐ కొన్నేళ్ల క్రితమే బంగారాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించిందని ఒక అధికారి తెలిపారు. ఎక్కడ ఉంచాలనే దానిపై సమీక్ష జరుగుతోంది. విదేశాల్లో నిల్వలు పేరుకుపోతున్నందున, కొంత బంగారాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించారు. 1991 సంవత్సరంలో చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి చంద్రశేఖర్ ప్రభుత్వం ఈ విలువైన లోహాన్ని తనఖా పెట్టవలసి వచ్చింది. ఇంగ్లండ్ నుంచి వెయ్యి క్వింటాళ్ల బంగారం తీసుకురావడం అంత తేలికైన విషయం కాదు. ఇందుకోసం అనేక రకాల ప్రాసెస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేయాల్సి వచ్చింది. ప్రత్యేక విమానంలో దీన్ని భారత్‌కు తీసుకొచ్చారు. ఈ బంగారంపై ప్రభుత్వం ప్రత్యేక కస్టమ్ మినహాయింపును కల్పించింది. కేంద్ర ప్రభుత్వం దీనిపై జీఎస్టీ నుండి మినహాయింపు ఇవ్వలేకపోయింది. ఎందుకంటే జీఎస్టీ సేకరణను రాష్ట్రాలతో విభజించాలి.

# మహిళలకు రిస్క్ లేని ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్

**విశ్వంభర, బిజినెస్:**

సంపాదించిన దాంట్లో ఎంతో కొంత పొదుపు చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. వారి వారి ఆదాయాలకు అనుగుణంగా పొదుపు చేస్తుంటారు. అయితే ప్రతీ ఒక్కరూ తమ పెట్టుబడికి రక్షణతో పాటు మంచి ఆదాయం రావాలని ఆశిస్తుంటారు. రిస్క్ లేని పెట్టుబడుల కోసం అన్వేషిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.మరీ ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. పురుషులతో సమానంగా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న ప్రస్తుత తరుణంలో తాము సంపాదించిన మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాలనే ఆలోచనలో ప్రతీ ఒక్కరిలో పెరుగుతోంది. మరి మహిళల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న కొన్ని బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్..**
మహిళల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ఒకటి. ఈ పథకం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లాగా పనిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2023లో మహిళల కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద మహిళలకు పెట్టుబడులపై 7.50 శాతం చక్రవడ్డీ లభిస్తుంది. మహిళలు రూ.1000 నుంచి పెట్టుబడిని ప్రారంభించి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. ఉదాహరణకు, మీరు ఈ పథకంలో 50 వేల రూపాయలు పెట్టుబడి పెడితే, 2 సంవత్సరాల తర్వాత మీరు 58,011 రూపాయలు పొందుతారు.

**సుకన్య సమృద్ధి యోజన..**
మహిళల కోసం తీసుకొచ్చిన మరో అద్భుతమైన పథకం సుకన్య సమృద్ధి యోజన.. రూ. 250లతో ఏదైనా పోస్టాఫీస్ లేదా బ్యాంకులో ఖాతాను ఓపెన్ చేయొచ్చు. ఈ పథకంలో పన్ను రాయితీ కూడా అందుబాటులో ఉంటుంది. వడ్డీ రేటు సంవత్సరానికి 8.2 శాతంగా ఉంటుంది. 10 ఏళ్లలోపు ఆడబిడ్డలకు ఈ పథకంలో చేరొచ్చు. చిన్నారికి 2021 ఏళ్లు నిండినప్పుడు ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు.

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)..**
కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న మరో అద్భుత పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్.. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే ఈ పథకంలో ఎక్కువ వడ్డీఇన పొందుతారు. ప్రస్తుతం, ఈ పథకం సంవత్సరానికి 7.1 శాతం వడ్డీని చెల్లిస్తోంది. మీరు ఈ పథకంలో కనీసం రూ. 500 పెట్టుబడి పెట్టవచ్చు. పెట్టుబడి పరిమితి 1.5 లక్షల రూపాయల వరకు పెట్టొచ్చు. రూ. 1.5 లక్ష వరకు పన్ను రాయితీని పొందుతారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com


శ్రీ వేముల వీరేశం గారు
నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు
పేద ప్రజల ఆప్తుడు, ఆపన్నుల మిత్రుడు,
అక్షరం అందరికీ అందాలని ఉద్దీపన ఫౌండేషన్ ను ఆరంభించిన మహా జననేత
సంక్షేమాన్ని పంచడం జనహితాన్ని కోరడం ఆయన లక్ష్యం.
అందుకే పదవులు ఉన్నా లేకున్నా ప్రజలే పరమావధిగా
జీవితాన్ని ఆచరిస్తున్న
నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ వేముల వీరేశం గారికి
హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు
ఉద్దీపన ఫౌండేషన్